



# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

సంపుటి: 4 సంచిక: 164, పేజీలు - 08

బుధవారం, అక్టోబర్ 23, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati





## న్యాయం చేయండి, ఒత్తిడి తట్టుకోలేకపోతున్నాం

**- అమిత్ షాకు కోల్‌కతా ట్రైనీ డాక్టర్ తండ్రి లేఖ**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ సహా ఆర్‌జీ కర్ మెడికల్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ అరెస్ట్ అయ్యారు. అయితే ఈ ఘటన తర్వాత దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు వెల్లువెత్తాయి. నిందితులకు ఉరిశిక్ష విధించాలనే డిమాండ్లు తెరపైకి వచ్చాయి. ఈ క్రమంలోనే బాధిత కుటుంబానికి న్యాయం

2లో..

## కేసీఆర్ లేకుండానే సాగుతున్న

# రాజకీయాలు

**- కేటీఆర్ ఇక పూర్తి స్థాయి చార్జ్ తీసుకున్నట్లేనా.?**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ ఫిజికల్ ప్రజెన్స్ లేకుండా కీలకమైన పరిణామాలు జరిగిపోతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల ప్రచారం తర్వాత ఫామ్ హౌస్ కు వెళ్లిన కేసీఆర్ అప్పటి నుండి చిన్న ప్రకటన కూడా రిలీజ్ చేయలేదు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో తన పేరుపై సోషల్ మీడియా ఖాతాలను ప్రారంభింపచేశారు. కానీ అందులో పోస్టులు పెట్టడం ఆపేశారు. అసలు రాజకీయంగా పూర్తిగా సైలెంట్ అయిపోయారు. పార్టీ నేతలకూ ఆయన సలహాలు, సూచనలు ఇస్తున్న సూచనలు కూడా కనిపించడం లేదు. పూర్తిగా కేటీఆర్ మాత్రం ఒంటరిగా పార్టీని లాగుతున్నారు. మధ్యలో హరీష్ కూడా తన వంతు సాయం చేస్తున్నారు. అయితే మొత్తం కేటీఆరే కనిపిస్తున్నారు.

### అదిగో ఇదిగో అనే ప్రచారమే కానీ కేసీఆర్ నో యాక్టివ్

కల్వకుంట్ల కవితకు బెయిల్ వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రజల్లోకి వస్తారన్న ప్రచారం జరిగింది. పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ చేయని కారణంగా రైతుల్లో ఉన్న అసంతృప్తిని ఉద్యమంగా మార్చేందుకు ఆయన సిద్ధమవుతున్నారని బీఆర్ఎస్ వర్గాలు చెప్పాయి.

2లో..

## కమ్మేస్తోన్న

# వాయు కాలుష్యం

**- ఢిల్లీలో క్రమంగా క్షీణిస్తోన్న గాలి నాణ్యత సూచి**

**- అక్టోబరు 15 నుంచి అమల్లోకి వచ్చిన ఆంక్షలు**

**- మంగళవారం నుంచి మరిన్ని కఠిన చర్యలు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశ రాజధాని ఢిల్లీలో శీతకాలం రాకముందే వాయు కాలుష్యం భయపెడుతోంది. గత నాలుగైదు రోజులుగా గాలి నాణ్యత సూచి దారుణంగా క్షీణిస్తోంది. మంగళవారం ఉదయం మరింత దారుణంగా పడిపోవడంతో రెండో దశ ప్లాన్ అమల్లోకి వచ్చింది. వాయు నాణ్యత-వాతావరణ అంచనా పరిశోధన డేటా ప్రకారం ఉదయం 8 గంటల సమయానికి వాయు నాణ్యత 317గా నమోదయ్యింది. దీనిని చాలా తీవ్రమైన కేటగిరీగా పరిగణిస్తారు. వాయు నాణ్యత 0- 50 మధ్య ఉంటే సంతృప్తికరమైందిగా 51 నుంచి 100 మధ్య ఉంటే స్వచ్ఛమైందిగా 101 నుంచి 200 మధ్య ఉంటే మోస్తరు 201 నుంచి 300 మధ్య ఉంటే ప్రమాదకరమైందిగా 400 నుంచి 450 మధ్య నమోదయితే అత్యంత ప్రమాదకరం 450 మించితే అత్యంత తీవ్రమైన పరిస్థితిగా పరిగణిస్తారు. ఢిల్లీలో రాబోయే రోజుల్లో రోజువారీ సగటు గాలి నాణ్యత సూచి దారుణంగా ఉంటుందని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులే అందుకు కారణమని పేర్కొంది.

2లో..

## మీకూ.. మీ కాంగ్రెస్ పార్టీకి ఓ దండం

**- మమ్మల్ని ఇలా బతకనివ్వండి**

**- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన కామెంట్స్**

2లో..



## ఏపీని డ్రోన్ హబ్‌గా మార్చడమే మా లక్ష్యం

**- అమరావతిలో ప్రారంభమైన డ్రోన్ సమ్మిట్**

**- ఫ్యూచర్ గేమ్ ఛేంజర్స్ డ్రోన్స్ అన్న చంద్రబాబు**

**- ఇకపై డ్రోన్ పైలట్ ప్రాజెక్టులకు ఏపీ వేదిక అవుతుందని వ్యాఖ్య**

**- మరో 15 రోజుల్లో డ్రోన్ పాలసీ తీసుకువస్తామని వెల్లడి**

2లో..



## వాట్సప్ ద్వారా పౌర సేవలు

**- మెటాతో ఏపీ సర్కారు ఒప్పందం**



**న్యూఢిల్లీ / అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆండ్రాయిడ్ ఫోన్, వాట్సప్ ఏబీసీడీలు రాని వారికి కూడా వీటిపై అవగాహన ఉంటోంది. బ్యాంక్ అకౌంట్ లేకపోయినా కూడా వాట్సప్ అకౌంట్ ఉండే పరిస్థితి నేటి జనరేషన్‌ది. అయితే ఇలాంటి వాట్సప్ ద్వారా పౌర సేవలను అందించేందుకు ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు పౌర సేవలను మరింత సులభతరంగా అందించేందుకు గానూ ఏపీ ప్రభుత్వం మెటాతో ఒప్పందం కుదుర్చుకుంది. మంత్రి నారా లోకేష్ సమక్షంలో ప్రభుత్వ అధికారులు, వాట్సప్ ప్రతినిధులు అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. త్వరలోనే మెటా టెక్నాలజీ ద్వారా పౌర సేవలను ఒక్క క్లిక్ ద్వారా అందిస్తామని నారా లోకేష్ ఒప్పందం అనంతరం ట్వీట్ చేశారు. ఇక ఈ ఒప్పందం ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు మొదలుకుని ప్రభుత్వం అందించే ధ్రువీకరణ పత్రాలు కరెంట్ బిల్లుల దగ్గర నుంచి ఇంటి పన్నులు, నల్లా పన్ను, ఇతరత్రా బిల్లుల చెల్లింపుల వరకూ అన్ని పౌరసేవలనూ వాట్సప్ ద్వారా ఒక్క క్లిక్‌తో అందించేందుకు ఏపీ ప్రభుత్వం

2లో..

## విజయవాడ పున్నమి ఘాట్‌లో డ్రోన్ షో అదుర్స్

**- 5 గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సొంతం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆకాశం నుంచి చుక్కలు దిగి వచ్చి నృత్యం చేసినట్లుగా లయబద్ధంగా డ్రోన్లు చేసిన విన్యాసాలతో విజయవాడ కృష్ణాతీరం పులకరించిపోయింది. ఐదు వేలకు పైగా డ్రోన్లతో జరిగిన మెగా షో అద్భుతంగా సాగిపోయింది. ప్రత్యక్షంగా ఈ షోను చూసేందుకు ఎనిమిది వేల మందికి అవకాశం కల్పించారు. అయితే బెంజిసర్కిల్, రామవరప్పాడు, వారధి, బస్టాండ్, ప్రకాశం బ్యారేజీల వద్ద భారీ డిజిటల్ తెరలను ఏర్పాటు చేశారు. అక్కడ ప్రజలు పెద్ద ఎత్తున గుమికూడి డ్రోన్ షోను చూశారు. విజయవాడ డ్రోన్ షోకు ఐదు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ వచ్చాయి. గిన్నిస్ బుక్ ప్రతినిధులు సీఎం చంద్రబాబుకు ధ్రువపత్రాలు అందించారు.

2లో..

## ధరణి పోర్టల్ నిర్వహణ

# ఎన్ఐసీకి అప్పగింత

**- రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సంచలన నిర్ణయాలతో పాలనలో దూసుకుపోతున్న రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్ నిర్వాహణ బాధ్యతలను ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్) కి అప్పగిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు టెరాసిస్ ప్రైవేటు సంస్థ నిర్వహిస్తున్న ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎన్ఐసీకి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. అయితే మూడేళ్ల పాటు ఈ పోర్టల్ నిర్వహణ బాధ్యతలను ఎన్ఐసీకి అప్పగిస్తూ ఒప్పందం చేసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎన్ఐసీ పనితీరు బాగుంటే మరో రెండేళ్లు నిర్వహణ బాధ్యతలను పొడిగించుకునే వెసులుబాటును కూడా కల్పిస్తూ రేవంత్ రెడ్డి సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. టెరాసిస్ నుంచి ఎన్ఐసీకి అప్పగించడం ద్వారా దాదాపు కోటి రూపాయల నిర్వహణ భారం కూడా తగ్గుతుందని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. అయితే ధరణి పోర్టల్‌కు చెందిన సాంకేతిక అంశాలను ఎన్ఐసీకి నవంబరు 30వ తేదీ వరకు టెరాసిస్ సంస్థ సిబ్బంది పూర్తి స్థాయిలో బదలాయించనుందని రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే.. ధరణి పోర్టల్ స్థానంలో

2లో..

## మూసీ నిర్వాసితులకు తీపి కబురు

**- ఒక్కో కుటుంబానికి 200 గజాల ఇంటి స్థలం - ఔటర్ రింగు రోడ్డు లోపలే స్థలాలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరం నడిబొడ్డున ప్రవహించే మూసీ నది ప్రక్షాళనకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకంటున్న సంగతి తెలిసిందే. మూసీ పునరుజ్జీవనం పేరుతో గత వైభవాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుంది. అందులో భాగంగా మూసీ పరివాహకప్రాంతాల్లోని అక్రమణలను తొలగిస్తోంది. రివర్ బెడ్ ప్రాంతంలోని ఇండ్లను కూల్చేయాలని భావిస్తోంది. ఈ మేరకు మూసీ నిర్వాహిసుతులకు డబుల్ బెడ్ రూం ఇండ్లను కేటాయిస్తోంది. ఇప్పటికే పలువురు మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇండ్లను మంజూరు చేశారు. రూ.25వేల చొప్పున నగదు, ఉపాధి కోసం రూ.2 లక్షల లోన్లను ప్రభుత్వం అందజేస్తోంది. తాజాగా మూసీ నిర్వాసితులకు తెలంగాణ ప్రభుత్వం మరో గుడ్‌న్యూస్ చెప్పేందుకు సిద్ధమైంది. మూసీ బాధితులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు

2లో..

## వాళ్లందరికీ ఇదొక గుణపాఠం

**- వ్యక్తిగత దాడులను సహించను**

**- లక్ష్మణ రేఖ గీస్తానంటూ కేటీఆర్ హెచ్చరిక**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాజకీయంగా పోరాటం చేస్తూంటే వ్యక్తిగత దాడులకు పాల్పడుతున్నారని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత దాడులు చేసేవారిపై పోరాటం కొనసాగిస్తానని సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని, తప్పకుండా నిజం గెలుస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటికే మంత్రి కొండా సురేఖపై రూ. 100 కోట్లకు పరువు నష్టం దావా వేశానని గుర్తు చేశారు. ఇలాంటి చౌకబారు ఆరోపణలకు అడ్డూ అదుపు ఉండడం లేదని ఇక నుంచి అలాంటి ఆరోపణలు చేయకుండా లక్ష్మణ రేఖ గీయాల్సి ఉందన్నారు.

2లో..

# న్యాయం చేయండి, ఒత్తిడి తట్టుకోలేకపోతున్నాం

చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే తాజాగా బాధితురాలి తండ్రి.. కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. తాము మానసిక ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నామని తమ కుటుంబానికి న్యాయం చేయాలని అమిత్ షాకు రాసిన లేఖలో బాధితురాలి తండ్రి విజ్ఞప్తి చేశారు. తమను కలిసేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని మెయిల్ చేశారు. తమ బిడ్డకు జరిగిన అఘాయిత్యానికి న్యాయం కోసం కుటుంబ సభ్యులం ఎదురుచూస్తున్నామని అయితే తమకు సాయం చేసేవారు ఎవరూ లేరని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమార్తెకు జరిగిన అమానవీయ ఘటన తర్వాత.. తమ కుటుంబ సభ్యులు అంతా తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే తాము నిస్సహాయులం అనే భావన కలుగుతోందని పేర్కొన్నారు. ఈ కేసు వీలైనంత త్వరగా పూర్తయ్యేందుకు తమ కుమార్తెకు న్యాయం జరిగేందుకు, మీరు మార్గదర్శకత్వం ఉపయోగపడుతుందని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయమై మాట్లాడేందుకు మీరు అపాయింట్‌మెంట్ అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు ఆ లేఖలో బాధితురాలి తండ్రి తెలిపారు. ఈ మేరకు అమిత్ షాకు ఈ-మెయిల్ చేశారు. కోల్‌కతా హత్యాచార ఘటన తర్వాత దేశం మొత్తం తీవ్రస్థాయిలో ఆందోళనలు జరిగాయి. ఈ ఘటనలో సంజయ్ రాయ్ ఒక్కడే నిందితుడు అని సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. మరోవైపు.. ఈ హత్యాచార ఘటన తర్వాత తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తూనే ఉన్నారు. దీంతో దీక్ష కారణంగా కొందరు జూనియర్ డాక్టర్ల ఆరోగ్యం క్షీణిస్తుండటంతో అప్రమత్తమైన మమతా బెనర్జీ ప్రభుత్వం వారితో చర్చలు జరిపింది. అవి సఫలం కావడంతో వారు దీక్ష విరమించారు.

# కేసీఆర్ లేకుండానే సాగుతున్న రాజకీయాలు

ఒకటి రెండు రోజుల్లో టూర్ షెడ్యూల్ రెడీ అవుతుందని కూడా అన్నారు కానీ రెండు నెలలు గడుస్తున్నా ఆయన బయటకు రాలేదు. వస్తారన్న నమ్మకం కూడా ఇప్పుడు బీఆర్ఎస్ నేతలకు లేదు. దీనికి కారణం కేటీఆర్ కూడా కేసీఆర్ వస్తారని ఉద్యమాలు చేద్దామని చెప్పడం లేదు. ఎవరైనా కేసీఆర్ వస్తే బాగుండనే సహాలిస్తున్నా వెంటనే తుంచేస్తున్నారు. కేసీఆర్ లేని లోటును తీర్చేలా తానే ప్రతీ దానికి ముందు ఉండేలా చురుకుగా వ్యవహరిస్తున్నారు.

### అత్యంత కీలక పరిణామాల్లోనూ కేసీఆర్ స్పందించకపోవడానికి కారణం.?

తెలంగాణ రాజకీయాలు చాలా వేడి మీద ఉన్నాయి. ఒక్కో అంశం హాట్ టాపిక్ అవుతోంది. మొదట రుణమాఫీ అంశంతో బీఆర్ఎస్ ఉద్యమం చేసినంత పని చేసింది. ఈ కారణంగా అందరికీ రుణమాఫీ కాలేదని కొంత మందికి పెండింగ్ ఉందని ప్రభుత్వం అంగీకరించాల్సి వచ్చింది. తర్వాత కేటీఆర్ పై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల దుమారం రేగింది. అది కేసీఆర్ ఫ్యామిలీని ఇబ్బంది పెట్టే విమర్శలే. అయినా స్పందించలేదు. తర్వాత గ్రూప్ వన్ వివాదం తెరపైకి వచ్చింది. అప్పటికి మూసీ వివాదం రేపిన చిచ్చు అలాగే ఉంది. మరి కొంత కాలం ఈ మూసీ వివాదం ఉంటుంది. అయినా కేసీఆర్ వైపు నుంచి కనీస స్పందనలేదు. పూర్తిగా రాజకీయాలపై కేసీఆర్ ఇప్పుడు వ్యతిరేకతతో ఉన్నారని ఆయన స్పందించడానికి కూడా సిద్ధంగా లేరని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

### కేటీఆర్ సామర్థ్యానికి పరీక్ష పెడుతున్నారా.?

కేటీఆర్ తెలంగాణ ఉద్యమం ఊపందుకున్న తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. అందువల్ల ఆయన రాజకీయాల్లో ధక్కా మొక్కీలు ఎదుర్కోలేదు. ఇప్పుడు అసలైన ప్రతిపక్ష నేతగా అనేక సవాళ్లను ఆయన ఎదుర్కోవాల్సి ఉంది. ఇప్పుడు ఎన్నో ఎదురు దెబ్బలి తిని రాటుదేలితేనే రాజకీయాల్లో మంచి భవిష్యత్ ఉంటుందన్న ఉద్దేశంతో కేటీఆర్‌కు ఫుల్ చార్జ్ ను కేసీఆర్ అప్పగించారని అంటున్నారు. ఎంతో క్లిష్టమన సందర్భంలో తప్పి ఇతర విషయాల్లో కనీసం సలహాలు కూడా ఇవ్వడం లేదని మొత్తం కేటీఆర్ సామర్థ్యానికి వదిలేశారని చెబుతున్నారు. కేటీఆర్ కూడా ఇప్పుడు తనను తాను నిరూపించడానికి ఎలాంటి సవాళ్లనైనా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నారని అంటున్నారు. కేసీఆర్, కవిత ఇప్పుడల్లా మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్ లోకి వచ్చే చాన్స్ లేదని అంటున్నారు.

# కమ్మేస్తోన్న వాయు కాలుష్యం

మంగళవారం నుంచి రెండో దశ ప్లాన్ అమల్లోకి రావడంతో ఢిల్లీ క్యాపిటిల్ ప్రాంతంలో బొగ్గు, వంట కలపతో పాటు డీజిల్ జనరేటర్ల వినియోగంపై ఆంక్షలు విధిస్తారు. గుర్తించిన కొన్ని రహదారులపై రోజూ స్వీపింగ్, నీటిని చిలకరిస్తారు. అలాగే, నిర్మాణ, కూల్చివేత ప్రదేశాలలో దుమ్ము నియంత్రణ చర్యలు కూడా అమలు చేయనున్నారు. దీంతో పాటు రద్దీ ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులను నియమించడం, వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని నియంత్రించేందుకు పార్కింగ్ ఫీజు పెంచడం, మెట్రో, ఆర్టీసీ సహా ప్రజా రవాణాను అదనపు సర్వీసులు ప్రారంభిస్తారు. ప్రజా రవాణాను ఉపయోగించాలని, వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు సూచించారు. ఆటోమొబైల్స్‌లో సిఫార్సు చేసిన వ్యవధిలో ఎయిర్ ఫిల్టర్‌లను క్రమం తప్పకుండా మార్చాలని, అక్టోబర్ నుంచి జనవరి వరకు కాలుష్యాన్ని ఉత్పత్తి చేసే నిర్మాణ కార్యకలాపాలను నివారించాలని కూడా స్పష్టం చేశారు. అలాగే, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను తగలుబెట్టరాదని ఆదేశించారు. అక్టోబరు 1 నుంచి అమల్లోకి వచ్చిన స్టేజ్-1 ప్లాన్‌కు ఇది అదనం. వాయు నాణ్యత 401 నుంచి 450 కి పడిపోతే స్టేజ్-3 అమల్లోకి తీసుకొచ్చి, వాయు కాలుష్యానికి కారణమయ్యే మరిన్ని కార్యకలాపాలపై ఆంక్షలు విధించనున్నారు. వాతావరణంలో సూక్ష్మ పరిమాణంలో ఉండే పీఎం 2.5 (పార్టికులేట్ మ్యాటర్) కాలుష్య కణాలు నేరుగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతాయి. దీనికి తోడు వాతావరణంలోకి విడుదలయ్యే ఇతర కర్బన ఉద్గారాల ప్రభావం ఢిల్లీపై తీవ్రంగా పడుతోంది. ఈ కారణాల వల్ల ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల్లో ఒకటిగా ఢిల్లీ మారిపోయింది. శీతాకాలంలో తక్కువ వేగంతో గాలులు వీయడంతో కాలుష్య కణాలను దిగువ వాతావరణ పొరల్లో నిలిచేలా చేస్తయి. దీని వల్ల కాలుష్యం పెరిగి, గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి దిగజారుతుంది.

# వాట్సప్ ద్వారా పౌర సేవలు

మెటాతో కలిసి అడుగులు వేస్తోంది. విపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో పలువురు విద్యార్థులు, యువత ఈ సమస్యను నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. సకాలంలో సర్టిఫికేట్లు అందక ఇబ్బందులు పడుతున్నామని టెక్నాలజీ సాయంతో అన్ని పనులూ ఇంటివద్దకే అందుతున్నప్పుడు పౌరసేవలను కూడా ఇలాగే అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే ఆ రకంగా చర్యలు తీసుకుంటామని నారా లోకేష్ అప్పట్లో హామీ ఇచ్చారు. ఇక ఇచ్చిన హామీ ప్రకారమే వాట్సప్ ద్వారా పౌర సేవలను అందించేందుకు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకుంటున్నారు. సర్టిఫికేట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా.. వాట్సప్ ద్వారా అందించేలా చర్యలు చేపట్టారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాలకు మాతృసంస్థ మెటా. ఈ నేపథ్యంలో మెటా యాజమాన్యంతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ద్వారా.. మెటా ఫ్లాట్ ఫామ్ వాట్సాప్ బిజినెస్ ద్వారా ఇకపై సర్టిఫికెట్లు వేగంగా, సులభంగా పొందే వీలుంటుంది, అలాగే ట్యాంపరింగ్ అవకాశం లేకుండా పారదర్శకంగా ఆన్‌లైన్‌లోనే సర్టిఫికెట్లు పొందే అవకాశం ఉంటుంది. మెటాతో ఒప్పందం చారిత్రాత్మకమైన మైలురాయిగా అభివర్ణించిన నారా లోకేష్.. యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చిన విధంగానే మొబైల్‌లోనే సర్టిఫికెట్లు అందిస్తామని అన్నారు.

# వాళ్లందరికీ ఇదొక గుణపాఠం

సోషల్ మీడియా ద్వారా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని తాను వ్యక్తిగత వివాదాల కంటే ప్రజా సమస్యలకే అధిక ప్రాధాన్యం ఇస్తానని గుర్తు చేశారు. చౌకబారు విమర్శలు చేసేవారికి తాను దాఖలు చేసిన పిటిషన్ ఒక గుణపాఠం అవుతుందని కోర్టులో నిజం గెలుస్తుందనే నమ్మకం ఉందన్నారు. బిఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలు తనపై అసభ్య పోస్టులు పెట్టారని మంత్రి కొండా సరేఖ కన్నీళ్లు పెట్టుకుని ఆరోపణలు చేశారు.

హరీష్ రావు ఇలా సోషల్ మీడియా కార్యకర్తలు పోస్టులు పెట్టడంపై విచారం వ్యక్తం చేశారు. అయితే కేటీఆర్ అవన్నీ దొంగ ఏడుపులని మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్ చాట్ లో వ్యాఖ్యానించారు. దాంతో కొండా సురేఖ కేటీఆర్ పై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన నాగార్జున ఫ్యామిలీని వేధించారని అన్నారు. ఈ విషయంలో నాగచైతన్య, సమంత విడాకుల ప్రస్తావన కూడా తీసుకు వచ్చారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కుటుంబాల ప్రతిష్టను దిగజార్చేవిగా ఉన్నాయని అటు నాగార్జున, ఇటు కేటీఆర్ కుటుంబాలు కోర్టును ఆశ్రయించాయి. నాగార్జున మొదటగా రూ. వంద కోట్లకు పరువు నష్టం పిటిషన్ దాఖలు చేశారు. కుటుంబసమేతంగా వాంగ్మూలం ఇచ్చారు. మరికొందరి వాంగ్మూలాలు నమోదు చేయాల్సి ఉంది. కేటీఆర్ కూడా ఆ తరవాత పిటిషన్ దాఖలు చేశారు. ఆయన గత వారం స్వయంగా వెళ్లి వాంగ్మూలం నమోదు చేయాల్సి ఉండగా. కానీ కోర్టులో వాయిదా కోరారు. ఆ రోజున మూసిపై ప్రజెంటేషన్ ఇచ్చారు. మళ్లీ నేడు ఆయన కోర్టుకు వెళ్లి వాంగ్మూలం ఇచ్చే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. తుది వరకూ పోరాడతానని ఆయన చెబుతున్నారు.

# ఏపీని డ్రోన్ హబ్‌గా మార్చడమే మా లక్ష్యం

అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ ప్రభుత్వం అమరావతిలో డ్రోన్ సమ్మిట్ మంగళవారం ఉదయం ప్రారంభించింది. డ్రోన్ టెక్నాలజీకి నాలెడ్జ్ పార్టనర్‌గా ఐఐటీ తిరుపతితో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తిరుపతి, దాని టెక్నాలజీ ఇన్నోవేషన్ హ, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ కలిసి పనిచేయనున్నాయి. ఈ సహకారంతో ఇంటిగ్రేషన్, డిజిటల్ ట్విన్ టెక్నాలజీ, స్టార్టప్ సపోర్ట్ తో పాటు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడం లాంటి పలు రంగాలలో సాంకేతిక అభివృద్ధిపై ఫోకస్ చేయనున్నాయి. ఈ ఒప్పందం ద్వారా ఉమ్మడిగా పరిశోధన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సాంకేతికంగా మరిన్ని ఆవిష్కరణలను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అమరావతిలో జరిగిన డ్రోన్ సమ్మిట్ లో ఐఐటీ తిరుపతికి చెందిన సుమారు 15 మంది విద్యార్థులు, 8 మంది అధ్యాపకులు ఈ హ్యాకథాన్‌లో పాల్గొన్నారు. ప్రాజెక్ట్ లలో ఒకటైన "ప్రకృతి విపత్తుల సమయంలో నెట్‌వర్క్‌ని పునరుద్ధరించడానికి ఏరియల్ బేస్ స్టేషన్" ను ఐఐటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సర్వేంద్ర నాథ్ క్రియేట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ తిరుపతికి అవార్డు దక్కింది. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ సీఎం చంద్రబాబు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ డ్రోన్ సమ్మిట్ లో పాల్గొన్నారు. ఇందులో ప్రారంభోపాన్యాసం చేసిన సీఎం చంద్రబాబు డ్రోన్లపై ప్రసంగించారు. ఇవి ఫ్యూచర్ గేమ్ ఛేంజర్స్ అంటూ కామెంట్ చేశారు. 1995లో తాను ఐటీ గురించి ఆలోచిస్తే ఎవరూ నమ్మలేదని ఇప్పుడు డిజిటల్ యుగంలో జీవిస్తున్నామని గుర్తు చేశారు. అదే మాదిరిగా భవిష్యత్‌లో టెక్నాలిజీని డ్రోన్స్ మరో స్థాయికి తీసుకెళ్తాయని జోస్యం చెప్పారు చంద్రబాబు. ఆ మార్పును అందిపుచ్చుకునే ఉద్దేశంతో డ్రోన్స్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. అభివృద్ధిలో డ్రోన్స్ కీలక పాత్ర పోషించబోతున్నాయని గ్రహించినందునే డ్రోన్ సమ్మిట్ పెట్టి మార్పులను చర్చిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఇలాంటి కార్యక్రమం ఇప్పటి వరకు దేశంలో ఎవరూ చేయలేదని తొలిసారి ఏపీ ముందడుగు వేసిందని అన్నారు. 1995 నుంచి ఐటీ డెలవప్‌మెంట్‌కు ఎలాంటి చర్యలు తీసుకున్నామో ఇప్పుడు అంతకంటే మెరుగైన ప్రణాళికతో డ్రోన్స్ ద్వారా సంపద పెంచబోతున్నామని తెలిపారు. ఐటీ డెలవప్‌మెంట్‌తో ఎలా హైదారాబాద్ ప్రపంచ నగరాల సరసన చేరిందో రేపటి భవిష్యత్‌లో అమరావతి కూడా అభివృద్ధి సిటీగా మారబోతోందని అభిప్రాయపడ్డారు చంద్రబాబు. ఏపీని డ్రోన్స్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. విజయవాడ వరదల టైంలో డ్రోన్స్ పని తీరు ప్రజలు కూడా గమనించారని వివరించారు. రెస్క్యూటీం వెళ్లలేని ప్రాంతాలకు డ్రోన్స్ వెళ్లి ఆహారం, నీళ్లు, మందులు అందించాయని పేర్కొన్నారు.

# విజయవాడ పున్నమి ఘాట్‌లో డ్రోన్ షో అదుర్స్

1) లార్జెస్ట్ ప్లానెట్ ఫార్మేషన్ లో గిన్నిస్ రికార్డు
2) నదీ తీరాన లార్జెస్ట్ ల్యాండ్ మార్క్ సృష్టితో మరో గిన్నిస్ రికార్డ్
3) అతిపెద్ద విమానాకృతిలో గిన్నిస్ రికార్డ్
4) డ్రోన్లతో అతిపెద్ద జాతీయ జెండా ఆకృతి క్రియేట్ చేసి గిన్నిస్ రికార్డ్
5) అతిపెద్ద ఏరియల్ లోగో ఆకృతితో ఐదో గిన్నిస్ రికార్డ్ నెలకొల్పారు

పున్నమిఘాట్‌లో జరిగిన ఈ డ్రోన్ షో లో మొత్తం ఏడు థీమ్ చిత్రాలను ప్రదర్శించారు. విమానయానానికి తద్వారా డ్రోన్లయానానికి పితామహుడిగా పేరు పొందిన రైట్ బ్రదర్స్ చిత్రాన్ని ముందుగా ఆవిష్కరించారు. ఆ తర్వాత భారీ బోయింగ్ విమానం, డ్రోన్, రాజధాని అమరావతిని స్మరించేలా ధ్యానబుద్ధుడు, గ్లోబ్ చిత్రాలను డ్రోన్ల ద్వారా ఆవిష్కరించారు. జాతీయ జెండాతో పాటు ఐసీఏవో లోగోను ఆవిష్కరించారు. మొత్తం 5,500 డ్రోన్లతో ఆకాశంలో ఈ సప్తవర్ణ చిత్రాలను సృష్టించారు. ఈ చిత్రాలన్నీ వరుస క్రమంలో చక్కగా కనిపించటానికి డ్రోన్లను ఆయా స్థానాల్లో నిలబెట్టేందుకు కంప్యూటర్ ప్రోగ్రామింగ్ కూడా వినియోగించారు. డ్రోన్ల షోకు ముందుగా బబ్బూరి గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. డ్యాన్సర్ల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తర్వతా లేజర్ బీమ్ షో కూడా నిర్వహించారు. చివరిగా బాణాసంచా పేలుళ్ల ప్రదర్శనలో హైలైట్‌గా నిలిచాయి.

# మూసీ నిర్వాసితులకు తీపి కబురు

సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఔటర్ రింగ్ రోడ్డు వెంట నిర్వాసితులకు ఇండ్ల జాగాలు ఇవ్వాలని రేవంత్ సర్కార్ భావిస్తోందట. అయితే ఈ నెల 26న తెలంగాణ కేబినెట్ సమావేశం జరగనుంది. ఆ భేటీలో మూసీ నిర్వాసితులకు ఇండ్ల జాగాలు ఇచ్చే విషయంపై కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఒక్కో కుటుంబానికి 150 నుంచి 200 చదరపు గజాల చొప్పున ప్లాట్ అందజేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఆయా ప్లాట్ల విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.25 లక్షల నుంచి రూ. 30 లక్షల దాకా ఉంటుందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని రివర్బెడ్, బఫర్ జోన్లలో ఉన్న నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఈ ఇండ్ల జాగాలను ఇవ్వాలని భావిస్తున్నారట. హైదరాబాద్ నగరం నాలుగు వైపులా ఔటర్రింగ్ రోడ్డు లోపలే వారికి ఇండ్ల జాగాలు ఇవ్వాలని యోచిస్తున్నట్లు తెలిసింది. కాగా, మూసీ నిర్వాసితులు దాదాపు 13 వేలకు పైగానే ఉంటారని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఒక్కో కుటుంబానికి 150-200 చదరపు గజాల చొప్పున అందజేసినా మ్మొత్తం 600-700 ఎకరాల భూమి అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ భూములను గుర్తించాల్సిన అవసరం ఉంది. ఇక ఒక్కో ప్లాట్ విలువ రూ.25-30 లక్షల దాకా ఉండటంతో నిర్వాసితులు మూసీ వీడేందుకు ముందుకు వచ్చే అవకాశముందని అధికారులు, ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఈనెల ఈ నెల 26న జరగనున్న రాష్ట్ర కేబినెట్ భేటీలో దీనిపై చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# ధరణి పోర్టల్ నిర్వహణ ఎన్ఐసీకి అప్పగింత

భూమాత పేరుతో పోర్టల్ ఏర్పాటుకు రేవంత్ రెడ్డి సర్కార్ కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. ధరణి పోర్టల్‌ను ప్రైవేటు సంస్థ నుంచి ప్రభుత్వ ఎన్ఐసీకి బదలాయింపు ప్రక్రియను ప్రభుత్వం ఇటీవే పూర్తిచేసింది. ఇక పేరు మార్చటమే తరువాయిగా తెలుస్తోంది. ధరణి పోర్టల్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా దాదాపు పరిష్కరించినట్టు తెలుస్తోంది.

కొత్త చట్టంతో ముడిపడి ఉన్న అంశాలకు సంబంధించిన దరఖాస్తులే మిగిలిపోయినట్లు అధికారులు చెప్తున్నారు. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ధరణి పోర్టల్‌ను తీసుకురాగా దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని రాజకీయ పార్టీల నేతలు భూములు ఆక్రమించుకున్నారంటూ ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి. మరోవైపు భూతగాదాలు కూడా పెరిగిపోయాయని వాటికి సంబంధించిన వివాదాలు గుట్టుగుట్టలుగా పెండింగ్‌లో పడ్డాయంటూ విమర్శలు వచ్చాయి. కాగా ఈ ధరణి పోర్టల్ నిర్వాహణను ప్రైవేటు సంస్థకు ఇవ్వటం ద్వారా ప్రజలకు సంబంధించిన సమాచారానికి గోప్యత లేకుండా పోయిందని దీని వల్ల చాలా అక్రమాలకు ధరణి పోర్టల్ కారణమైందంటూ ఆరోణపలు వెల్లువెత్తాయి. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని బంగాళఖాతంలో కలిపేస్తామంటూ ఎన్నికల్లో ప్రచారం చేసిన విషయం తెలిసిందే. కాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ నిర్వాహణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పటికే పెండింగ్ ఉన్న వివాదాలను పరిష్కరించే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలోనే ధరణి పోర్టల్ నిర్వహాణను ఎన్ఐసీకి అప్పగించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది.

# రుద్రంగి కే.జీ.బీ.వీ. ఆకస్మిక తనిఖీ

**చందుర్తి / రుద్రంగి అక్టోబర్ 22:** చందుర్తి మండల కేంద్రంలో పీ హెచ్ సీ నూతన భవన తుది దశ పనులు పూర్తి చేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. చందుర్తిలో రూ. 1 కోటి 56 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను రోడ్స్ అండ్ బిల్డింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టగా, కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవనంలోని అన్ని గదులు, ఆవరణను పరిశీలించారు. దవాఖాన ఆవరణను మొత్తం శుభ్రం చేయించాలని ఎంపీడీఓను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భవనంలో తుది దశ పనులను త్వరగా పూర్తి చేసి, ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

పాత భవనం నుంచి నూతన భవనంలోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని వైద్యాధికారి సంపత్ కు సూచించారు. విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి సారించాలని టీచర్లను కలెక్టర్ ఆదేశించారు. రుద్రంగిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. వారిని వివిధ సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. అనంతరం కిచెన్, స్టోర్ రూం పరిశీలించారు. మెనూ ప్రకారం ఏ ఏ ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నారో తనిఖీ చేశారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వారు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యాలయానికి ప్రహరీ నిర్మించాలని కలెక్టర్ కు విద్యాలయం బాధ్యులు విన్నవించారు. ఈ పర్యటనలో ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, డీఈఓ రమేష్ కుమార్, టీచర్ వనిత తదితరులు పాల్గొన్నారు.

# మీకూ.. మీ కాంగ్రెస్ పార్టీకి ఓ దండం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ నేత మారు గంగారెడ్డి దారుణ హత్యకు గురికావటం కలకలం రేపుతోంది. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రధాన అనుచరుడిగా ఉన్న గంగారెడ్డిని జాబితాపూర్ శివారులో సంతోష్ అనే కారుతో ఢీకొట్టి కత్తితో పొడిచి చంపేశారు. తీవ్ర గాయాలపాలైన గంగారెడ్డిని ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయాడు. పాతకక్షలతోనే ఈ హత్య జరిగినట్లు తెలుస్తోంది. కాగా, గంగారెడ్డి హత్యను నిరసిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆందోళన చేపట్టారు. జగిత్యాల-ధర్మపురి రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గంగారెడ్డిది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని జీవన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రమంతటా కాంగ్రెస్ అధికారంలో ఉంటే జగిత్యాలలో మాత్రం బీఆర్ఎస్ పార్టీ హవా నడుస్తోందని ఇటీవల పార్టీలో చేరిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యనించారు. ఇక జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరు లక్ష్మణ్ కుమార్ అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. మీకూ మీ కాంగ్రెస్ పార్టీకి ఓ దండం మమ్మల్ని ఇలా బతకనివ్వండి అంటూ అసహనం వ్యక్తం చేశారు. తాను ఇక రాజకీయాల్లో కొనసాగనని ఏదైనా స్వచ్ఛంద సంస్థ పెట్టుకుని ప్రజలకు సేవ చేస్తా అని అన్నారు. ఇలా అయినా మమ్మల్ని బతకనివ్వండని వేడుకున్నారు. 'కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకొని మమ్మల్ని చంపేస్తున్నారు. ఇంతకాలం మానసిక అవమానాలకు గురవుతున్నా కానీ తట్టుకున్నాం. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా?.. లేవా? కాంగ్రెస్ రాజ్యంలో కాంగ్రెస్ నాయకులకే రక్షణ కరువైంది. జగిత్యాలలో బీఆర్ఎస్ రాజ్యం నడుస్తుందా? కాంగ్రెస్ రాజ్యం నడుస్తుందా? ప్రాణహాని ఉందని తెలిపినా.. పోలీసులు ఏం చేశారు. నిందితుడిగా భావిస్తున్న వ్యక్తి రౌడీషీటర్. 20 కేసులున్నా అతన్ని పట్టుకోలేదు.' అని జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జీవన్ రెడ్డికి ఫోన్ చేశారు. ఆయనపైనా జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎందుకు కొనసాగాలని ప్రశ్నించారు. 40 ఏళ్ల పార్టీని నమ్ముకుంటే చివరకు మిగిలిందేంటని ప్రశ్నించారు. దయచేసి తనను క్షమించాలని తాను పార్టీలో ఉండలేనంటూ మహేష్ కుమార్ ఫోన్ మాట్లాడుతుండగానే కట్ చేశారు. గంగారెడ్డి హత్య ఘటనపై జగిత్యాల జిల్లా ఎస్పీకి కేంద్రమంత్రి బండి సంజయ్ ఫోన్ చేశారు. ఘటనపై విచారణ జరిపి నిందితుడిని శిక్షించాలని సూచించారు.

# ఆ నిందితుడింకా ఆసుపత్రిలోనే

**సికింద్రాబాద్** సికింద్రాబాద్ ముత్యాలయ్య ఆలయ పరిసరాల్లో ప్రస్తుతం పరిస్థితి శాంతంగా ఉంది, ఎవరు పుకార్లు నమ్మవద్దని నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. ఆందోళన లో దాడులకు పాల్పడిన ఐదుగురిని అరెస్ట్ చేశాం. విగ్రహ ధ్వంసం నిందితుడు ఇంకా ఆసుపత్రిలో నే వున్నాడు, డిశ్చర్జ్ అనంతరం రిమాండ్ చేస్తామని ఆమె అన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్‌పై జనసైనికుల లైగింక వేధింపులు

### - ఆత్మహత్యయత్నం చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ సునీత



**కరప** పెనుగుదురు ఫీల్డ్ అసిస్టెంట్ పూలపకుర సునీత పై జనసైనికులు వేధింపులు ఎక్కువవ్వడం తో భరించలేక తెల్లవారుజామున నిద్రమాత్రలు, టైల్స్ లోకి వాడే గమ్ ను కలుపుకుని త్రాగింది. దాంతో కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆమెకు చికిత్స ను అందిస్తున్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే.. ఎనర్జీఎస్ లో ఫీల్డ్ అసిస్టెంట్ గా విధులు నిర్వరిస్తున్న పూలపకూర సునీత ను కరప మండలానికి చెందిన జనసేన నాయకులు బండారు మురళి, నానీబాబు, భవానీ లు ఉపాధి హామీ లో దొంగ మస్తార్లు వేసి నెలకు రూ. 20వేలు ఇవ్వాలని గత మూడు నెలలుగా వేదిస్తున్నారని, బండారు మురళి తనతో సన్నిహిత్యం గా ఉండాలని, కోరిక తీర్చాలని వేధిస్తున్నాడని మనస్థాపం చెంది ఆత్మహత్యయత్నం చేసినట్లు, నానీబాబు అను వ్యక్తి కులదుషన చేస్తూ మనసునొచ్చుకునే విధంగా మాట్లాడుచున్నాడని, తన భార్య ఆత్మహత్యయత్ననికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని భర్త వీరబాబు తెలిపారు.

### అనంతపురంలో ఎడతెరిపి లేకుండా

# కురుస్తున్న వర్షం

**అనంతపురం** అనంతపురంలో వానలు దంచి కొడుతున్నాయి. రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగాన పల్లిలో భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కనగానపల్లి చెరువుకు గండి పడింది. పంటలకు భారీ నష్టం వాటిల్లింది. రామగిరి-ఎన్ఎస్ రేట్, ముత్తవకుంట్ల-కనగానపల్లి, తరగకుంట-కనగానపల్లి రహదారులన్నీ జలమయం అయ్యాయి.

### భారీగా పలు రోడ్ల నిర్మాణాలకు

# నిధుల మంజూరు

**హుస్నాబాద్ అక్టోబర్ 22:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో వివిధ రోడ్లు వంతెన నిర్మాణం కోసం పంచాయతీరాజ్ సీ ఆర్ ఆర్ (గ్రాంట్స్ నుండీ 1149.00 లక్షలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది.. హుస్నాబాద్ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం కోసం ఇంత పెద్ద నిధులు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ ప్రజలు.. హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలంలో కోహెడ నుండి తంగలపల్లి (వయ కురెళ్ళ) వరకు 1.10 కిమి బిటి రోడ్డు కోసం 155.00 లక్షలు, కోహెడ మండలం తంగలపల్లి నుండి శ్రీరాములపల్లి పీఢబ్ల్యూ రోడ్డు వరకు ( వయ కోహెడ మండలం సోమరంపల్లి) వరకు 1.60 కిమీ బిటి రోడ్డు నిర్మాణం కోసం 150.00 లక్షలు, హుస్నాబాద్ మండలం పందిల్ల స్టేజి ఆర్ ఎఫ్ సిద్దిపేట పీఢబ్ల్యూ డీ రోడ్డు నుండి పొట్లపల్లి వరకు ఉన్న సింగిల్ లైన్ రోడ్డు నుండి 5.50 కిమీ డబుల్ లైన్ రోడ్డు విస్తరణ కోసం 395.00 లక్షలు, అక్కన్నపేట మండలం సంజీవయ్య కాలని లో ఆర్ అండ్ బీ రోడ్డు 1.25 కిమి కోసం 140.00 లక్షలు, అక్కన్నపేట మండలం ఆర్ ఎఫ్, పీఢబ్ల్యూ డీ రోడ్డులో సీడీ వర్క్స్ కోసం చౌటపల్లి మీదుగా మల్లంపల్లి వరకు 100.00 లక్షలు, అక్కన్నపేట మండలం జడ్పీ రోడ్డు నుండి పరికబండ వరకు 0.50 కిమీ కోసం 60.00 లక్షలు, తోటపల్లి నుండి పుసవర్లపల్లి మధ్య వంతెన నిర్మాణం కోసం 149.00 లక్షలు, హుస్నాబాద్ నియోజకవర్గంలో భారీగా రోడ్ల నిర్మాణం వంతెన కోసం నిధుల విడుదల కు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క లకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు

# నేడు బద్వేల్ కు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాక

**బద్వేలు** ఈనెల 23న గుంటూరు, వైయస్సార్ జిల్లాల్లో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ పర్యటనఅఘాయిత్యానికి, హత్యాచారానికి గురైన ఆడపిల్లల కుటుంబాలను పరామర్శించనున్న వైయస్సార్ సీపీ అధినేత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 23న బుధవారం గుంటూరు, వైయస్సార్ జిల్లాల్లో పర్యటించనున్నారు. అఘాయిత్యాలకు గురైన ఆడపిల్లల కుటుంబాలను పరామర్శించనున్నారు.
టీడీపీ కార్యకర్త, రౌడీ షీటర్ దుర్మార్గం కారణంగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన తెనాలికి చెందిన యువతిని బుధవారం ఉదయం శ్రీ వైయస్ జగన్ పరామర్శించనున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువతిని, ఆమె కుటుంబాన్ని కలుసుకోనున్నారు. ఆ తర్వాత బద్వేలులో హత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని అదే రోజు మధ్యాహ్నం శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శించనున్నారు. అనంతరం ఆయన నేరుగా పులివెందులకు వెళ్తారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది.

# కుక్క తరమడంతో మూడవ అంతస్తు నుంచి దూకి యువకుడు మృతి

**రంగారెడ్డి** చందానగర్ లో కుక్క తరమడంతో మూడవ అంతస్తు పై నుండి ప్రమాదవశాత్తు కింద పడి యువకుడు మృతి చెందాడు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివి ఫ్రైడ్ హోటల్లో ఘటన జరిగింది. అయితే ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెనాలి కి చెందిన ఉదయ్ (23) కుటుంబ సభ్యులతో నగరానికి వచ్చి రామచంద్రపురం అశోక్ నగర్ లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం తన స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు చందానగర్ లోని వివి ఫ్రైడ్ హోటల్లో రూమ్ తీసుకున్నాడు. స్నేహితులతో కలిసి హోటల్లోని మూడవ అంతస్తు బాల్కనీలోకి వెళ్లగానే వారిని ఒక కుక్క తరిమింది. దీంతో భయాందోళనకు గురై వివి ఫ్రైడ్ హోటల్ మూడవ అంతస్తు బాల్కనీలోని కిటికీ నుండి ఉదయ్ కిందకు దూకాడు. తీవ్ర గాయాల పాలైన ఉదయ్ ను చికిత్స నిమిత్తం స్నేహితులు హాస్పిటల్ కు తరలించారు. అయితే, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కు పోలీసులు తరలించారు. దృశ్యాలు సీసీటీవీ కెమెరాల లో రికార్డు అయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకోగా సోమవారం రాత్రి వరకు బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. అసలు హోటల్ మూడవ అంతస్తులోకి కుక్క ఎలా వచ్చింది అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి....

## నడిగూడెం గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే పద్మావతి

**కోదాడ** సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి తనిఖీ చేశారు.పాఠశాలలోని పలు రికార్డులను తనిఖీ చేసి విద్యార్థులతో ముచ్చటించారు.ఉపాధ్యాయులు విద్యార్థులకు జీవన నైపుణ్యాలను నేర్పించాలన్నారు. తరువాత భోజనశాలను తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.విద్యార్థులు భవిష్యత్తు లో ఉన్నత శిఖరాల వైపు అడుగులు వేయాలన్నారు.

## కొడాలి నాని ఫ్లెక్సీలను అడ్డుకున్న పోలీసులు

**గుడివాడ** గుడివాడలో మాజీ మంత్రి కొడాలి నాని పుట్టిన రోజు వేడుకల ఫ్లెక్సీ ఏర్పాటును పోలీసులు అడ్డుకున్నారు. మంగళవారం జరగాల్సిన కొడాలి నాని పుట్టిన రోజు వేడుకలకు పోలీసులు అనుమతి నిరాకరించారు. వైసీపీ నేతలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసారు. గుడివాడ పేద ఎరుకపాడులో కొడాలి నాని ఫ్లెక్సీల ఏర్పాటును అడ్డుకున్నారు.

## కట్టలేరు వాగుపై వరద నీరు

**- నిలిచిపోయిన రాకపోకలు**

**ఎన్టీఆర్ జిల్లా** గంపలగూడెం మండలం వినగడప కట్టలేరు వాగుపై వరద ప్రవాహం ఎక్కువయింది. డైవర్షన్ రహదారిపై టిప్పర్ లారీ నిలిచిపోయింది. దాంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరు వాగుపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎగువున తెలంగాణ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా తోటమూల– వినగడప మధ్య ఉన్న వంతెనపై వరద నీరు పోటెత్తింది. కట్లేరు వద్ద ధ్వంసమైన వంతెన ప్రక్కన నిర్మించిన తాత్కాలిక రహదారిపై లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీ వరద నీటిలో ఇరుక్కుపోయింది.బి దీంతో సమీప 20 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి

## అనిల్‌పై అక్రమ కేసులు పెట్టారు

**గుంటూరు** బోరుగడ్డ అనిల్ కుమార్ పై అక్రమ కేసులు పెట్టి కావాలనే అరెస్ట్ చేశారని అయన భార్య బోరుగడ్డ మౌనిక ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు నగరంలోని రాజేందర్ నగర్ లో గల బోరుగడ్డ మౌనిక నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వాలనే పోలీసులు నా భర్త అనిల్ కుమార్ పైన తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేశారని అన్నారు. పవన్ కళ్యాణ్ గురించి వారి పిల్లల గురించి బోరుగడ్డ అనిల్ కుమార్ అసభ్యకరంగా మాట్లాడాడని సోషల్ మీడియాలో ఫేక్ వీడియోలు వచ్చేయని తెలియజేశారు. గతంలోని ఈ సంగతిపై బోరుగడ్డ అనిల్ కుమార్ ఓ ప్రముఖ చానల్లో వివరణ ఇవ్వటం జరిగిందని తెలియజేశారు. బోరుగడ్డ అనిల్ కుమార్ కు ఏదైనా జరగరానిది జరిగితే పూర్తిగా పోలీసులదే బాధ్యతని అన్నారు. నాకు న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తూనే ఉంటానని తెలియజేశారు..

## శబరిమల యాత్ర రూ.11,475

**సికింద్రాబాద్** శబరిమల దివ్యక్షేత్రాన్ని దర్శించు కోవాలనుకొనే యాత్రికులకు ఐఆర్సీటీసీ గుడ్ న్యూస్ చెప్పింది. సికింద్రాబాద్ నుంచి శబరిమల కు ప్రత్యేక భారత్ గౌరవ్ టూరిస్టు రైలును నవంబర్ 16 నుంచి 20 వరకు నడపాలని నిర్ణయించింది. టికెట్ ధరలు రూ.11,475 నుంచి ప్రారంభమవుతాయి. భోజనాలు అన్ని రైల్వే సిబ్బందే చూసుకుంటారు.అలాగే ట్రావెల్ ఇన్సూరెన్స్ కూడా ఉంటుంది.

## ఐదు కీలో మీటర్ల మేర ఆగిన ట్రాఫిక్

**- స్థంబించిన హైవే**

**పెనుకొండ** పెనుకోండ మండలం గుట్టురు సమీపంలో,జాతీయ రహదారి పై వర్షపు నీరు,వాహనాలను ఆపేసిన కియ యస్ ఐ రాజేష్ ఉ సిబ్బంది,వర్షపు నీటిలో ఇరుక్కున వాహనాలను జేసీబీతో పోలీసులు తొలగిస్తున్నారు.

## ప్రమాద బాధితుడిని అదుకున్న మంత్రి గొట్టిపాటి

**ఒంగోలు** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్వయంగా ఆస్పత్రికి పంపించారు. త్రోవగుంట పైవంతెనపై బైక్ ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వేగంగా వెళ్లింది. ? ప్రమాదం విషయం తెలుసుకుని బాధితుణ్ని మంత్రి గొట్టిపాటి ఆస్పత్రికి పంపారు. ఒంగోలు కిమ్స్ ఆస్పత్రికి ఫోన్ చేసి అంబులెన్స్ పిలిపించి పంపారు.

## నిత్యావసర వస్తువుల ధరలు వెంటనే తగ్గించాలి

**- సిపిఐ డిమాండ్**

**విశాఖపట్నం** దేశంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల ఒక తీవ్రమైన సమస్యగా మారిందని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు తెలిపారు. పెరిగిన ధరలు అదుపులో పెట్టాలని మంగళవారం జీవీఎంసీ 7 వార్డు పరిధిలో మల్లయ్యపాలెం, అయోధ్యనగర్, కొత్తపాలెం ఏరియాలలో సిపిఐ ఆధ్వర్యంలో ఇంటి ఇంటికి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించిన కార్యక్రమంలో పైడిరాజు పాల్గొని మాట్లాడుతూ
కూరగాయలు, పప్పులు, బియ్యం, వంట నూనె, వంటగ్యాస్ వంటి కనీస అవసరమైన నిత్యావసర వస్తువులు ధరలు సామాన్య ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతోందన్నారు.
ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు ఈ ధరల పెరుగుదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ ఈ ధరల పెరుగుదలను తీవ్రంగా నిరసిస్తూ, తక్షణమే ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నదన్నారు.
ఇంధన ధరలు తక్షణమే తగ్గించాల్సిన అవసరం ఉంది. పెట్రోల్ మరియు డీజిల్పై ఉన్న పన్నులను తగ్గించి, రవాణా ఖర్చులను తగ్గించడం ద్వారా నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించవచ్చని, రైతులకు తగిన మద్దతు ధరలు ఇవ్వడం ద్వారా రైతుల ఉత్పత్తులను నేరుగా కొనుగోలు చేయడం అవసరమని ఇది మధ్యవర్తుల ప్రభావాన్ని తగ్గించి, ధరలను నియంత్రించడానికి సహకరిస్తుందని తెలిపారు. పౌర సరఫరా వ్యవస్థ ద్వారా తక్కువ ధరలకే ప్రజలకు నిత్యావసర వస్తువులను సరఫరా చేయడం అత్యవసరమని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువులపై పన్నులను తగ్గించి, ప్రజలకు ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టాలని సిపిఐ డిమాండ్ చేస్తున్నాదని తెలిపారు.
వైసీపీ నాయకుడు అల్లాడ లింగేశ్వరరావు పాల్గొని సంఘీభావం తెలిపిన ఈ ప్రచారంలో సిపిఐ నాయకులు ఎం డి బేగం, వి సత్యనారాయణ, కొల్లి భాస్కరరావు, కానూరి రామారావు, పి రమణ, కె చిన్న, ఎన్ త్రినాధ్ తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేటీఆర్ కు పిచ్చిలేసి మాట్లాడుతున్నారు : జగ్గారెడ్డి

**హైదరాబాద్** దామగుండం కి భూమి కేటాయించినప్పుడు 9 లక్షల చెట్లు ఉన్నాయని కేటీఆర్ కి ఎందుకు గుర్తు లేదని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ప్రశ్నించారు. 9 లక్షల చెట్లు పోతాయి అని తెలిసి ఎందుకు జీవో ఇచ్చినవు. కేటీఆర్...జీఓ లో ఏముందో తెలుసా నీకు. ఎన్ని చెట్లు తీస్తే.. అదే సంఖ్యలో చెట్లు పక్కన నాటాలని ఉంది. ఇదెందుకు చెప్పడం లేదు. కాంగ్రెస్ మీద బురద జల్లడమే పనిగా పెట్టుకున్నాడు. పదేళ్లు రాజభోగాలు అనుభవించిన ఆయన.. ఇప్పుడు అవన్నీ దూరం అవ్వడంతో పిచ్చి లేసి మాట్లాడుతున్నారని అన్నారు. కేటీఆర్..కర్ణాటక ఎన్నికల్లో కుమార స్వామికి డబ్బులు పంపలేదా..? కేజ్రీవాల్ కి పంపింది నువ్వే కదా.. అందుకే మీ చెల్లెల్ని జైల్లో పెట్టింది కదా బీజేపీ. నవీన్ పట్నాయక్ కి ఫండింగ్ చేయలేదా..? నాలుగైదు రాష్ట్రాలకు డబ్బులు ఫండింగ్ చేసిన నువ్వు.. మాపై నిందలు వేయడం ఏంటి..? మేము ఎదురు దాడి చేయడం లేదని తమాషా చేస్తున్నావా..? కేటీఆర్ నాలుకకు నరం లేదు.. బుర్రకి తెలివి లేకా జీఓ ఇచ్చావా అని ప్రశ్నించారు. బుర్ర పని చేయక జీఓ ఇచ్చావా..? మూసి అక్కడే పుట్టింది అంటున్నావు.. మరి జీఓ ఇచ్చినప్పుడు గుర్తు లేదా మూసి గురించి. కేటీఆర్..వీటికి సమాధానం చెప్పాలి. కేటీఆర్ కి దమాక్ లేకనే ఖతం అయ్యాడని అన్నారు.

## బ్రెయిల్ డెడ్ యువతిని పరామర్శించిన టీడీపీ నేతలు

**గుంటూరు** గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెనాలి బ్రెయిన్ డెడ్ యువతి సహన కుటుంబ సభ్యులను టీడీపీ నేతలు ఆలపాటి రాజా, నక్కా ఆనంద్ బాబు మంగళవారం పరామర్శించారు. టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు మాట్లాడుతూ తెనాలి పట్టణంలో గత2రోజుల క్రితం దాడికి గురైన యువతి సహనాని పరామర్శకు వచ్చాం. వైసీపీ నేతలు దీనిపై పూటకొక రాజకీయం చేయడం, దానికోసం ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి గుంటూరు కు రావడం అంటే నవ్వొస్తుంది. గత వైసీపీ హయాంలో మహిళలపై జరిగిన దాడులు హత్యలు మరచిపోయారేమో అనిపిస్తుంది. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని చంద్రబాబు నాయుడు వైద్యులకు సూచించిన సంగతి తెలిసిందే. .వైసీపీ ప్రభుత్వం తయారు చేసిన మూలాల ఇంకా బ్రతికే ఉన్నాయని వాటిపై టీడీపీ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. సహనకి అన్నిరకాల సహాయక వనరులు సత్వరమే అందిస్తామని హామీ ఇచ్చారని అన్నారు.ఆసుపత్రి సుపరిండెంట్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చేసమయానికి యువతి సహన ఆరోగ్యం దారుణంగా ఉంది. ఇక్కడకు రాగానే అన్నిరకాల వైద్యసేవలు అందిస్తున్నాం. యువతి ఆరోగ్య పరిస్థితి చాలా తీవ్రంగా ఉంది, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అత్యంత క్లిష్టమైనఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో వైద్యం అందిస్తున్నామని అన్నారు.ఆలపాటి రాజా మాట్లాడుతూ సహనా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. సహనా జీవనం కోసం ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వైసీపీ నేతలు సహనా విషయంలో రాజకీయ రంగుపులమాలని చూస్తుండటం సిగ్గుచేటు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి గంజాయి రాజ్యాంగా మార్చారని వైసీపీ నేతలు దుయ్యబట్టారు బాధితులకు సహాయం అందడం లేదని వైసీపీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటు. సహనా విషయంలో వైసీపీ నేతలు మాటలు మాట్లాడటం మానుకుంటే మంచిదని హితవుపలికారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో విద్వేషాలు సృష్టించాలని చూస్తే చంద్రబాబు చూస్తూ కూర్చోవడం జరగదని గుర్తు చేశారు. జగన్మోహన్ రెడ్డి గుంటూరు పర్యటన చేస్తే ఏమైన భూమి బద్దలవుతుందా అని ఎద్దేవా చేశారు.సహనా విషయంలో నేరస్తులు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సహనా కుటుంబ సభ్యులకు టీడీపీ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు....

## గంగుల కమలాకర్ తల్లి మృతి

**- సంతాపం వ్యక్తం చేసిన మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్** కరీంనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాతృమూర్తి గంగుల నర్సమ్మ మరణం పట్ల తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సంతాపం వ్యక్తం చేసారు. గంగుల నర్సమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు మంత్రి శ్రీధర్ బాబు.

## పోలీస్ భార్యల నిరసన

**వరంగల్** పోలీసుల భార్యలు నిరసనకు దిగారు. వరంగల్ జిల్లా మామునూరు 4వ బెటాలియన్ కానిస్టేబుల్ కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. కానిస్టేబుళ్లను వెట్టిచాకిరి చేపిస్తూ,కనీసం సెలవులు కూడ ఇవ్వకుండా కుటుంబానికి దూరం చేస్తున్నారని పోలీస్ భార్యలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అధికారులు తమ సమస్యలను పరిష్క రించాలని కానిస్టేబుళ్ల భార్యలు ఈరోజు రోడ్డు ఎక్కి నిరసన వ్యక్తం చేసారున. నిరసనను ఆపేందుకు ఆర్ టీ ఓ ఆఫీస్ నుండి మామునూరు బెటాలియన్ వరకు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. రిజర్వ్ పోలీసుల బాధ లను అర్థం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ని కోరారు.

## గట్టుపల్లి వీరాంజనేయ స్వామివారి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్న శ్రీరాములు అందెల



**మహేశ్వరం** మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల్ గట్టుపల్లి లోని ప్రసిద్ధిగాంచిన వీరాంజనేయ స్వామి ఆలయంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి గారు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ గారితో కలిసి స్వామివారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు గారు మాట్లాడుతూ ఎంతో మహిమ గలిగిన ఆలయ ప్రాంగణంలో ఒక అన్యమతస్తుడు మేకను బలిచ్చి ఆలయ ప్రాంగణాన్ని అపవిత్రం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ ప్రక్షాళనలో భాగంగా ఈరోజు అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించామని తెలియజేశారు. అదేవిధంగా హిందువులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని తెలిపారు. నియోజకవర్గంలో హిందువులకు ఇంత అన్యాయం జరుగుతున్న కాంగ్రెస్ మరియు బిఆర్ఎస్ పార్టీల నాయకులు ఇప్పటివరకు స్పందించకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని, హిందువులంతా వారిని గమనిస్తున్నారని సమయం వచ్చినప్పుడు వారికి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పాపయ్య గౌడ్ గారు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి గారు, పార్లమెంట్ కో కన్వీనర్ అనంతయ్య గౌడ్ గారు, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి గారు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్ గారు, జిల్లా బీజేవైఎం అధ్యక్షులు యదీష్, మాజీ ఎంపీపీ కుండే వెంకటేష్, మండల అధ్యక్షులు మాధవచారి, బిజెపి నాయకులు శ్రీనివాస్ యాదవ్, యువ మోర్చా అధ్యక్షులు వనంపల్లి శ్రవణ్, రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, వివిధ క్షేత్ర నాయకులు, హిందూ బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రేమోన్మాది చేతిలో దారుణంగా హత్యకు గురైన దస్తగిరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే మాధవి

**బద్వేలు** దస్తగిరమ్మపై కిరాతకంగా దాడి చేసి చంపిన నిందితుడు విగ్నేష్ కి కఠిన శిక్ష అమలు పరిచేలా చంద్రబాబు నాయుడు పోలీసు శాఖ వారిని ఆదేశించారని, అలాగే వారి కుటుంబానికి తమవంతుగా ఒక లక్ష రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు. అలాగే జనసేన జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ విద్యార్థిని కుటుంబ సభ్యులను పరామర్శించారు వీరితోపాటు బద్వేలు తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త రితేష్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు జనసేన నాయకులు రెండు పార్టీల కార్యకర్తలు ఉన్నారు

## వేసవిలో స్కూలు ప్రోగ్రామ్

**- ఎన్ఏయూతో రిసాయా అకాడమీ భాగస్వామ్యం**

**హైదరాబాద్** సమ్మర్ స్కూల్ ప్రోగ్రామ్ను అందించడానికి నార్తర్న్ అరిజోనా యూనివర్సిటీ (ఎన్ఏయూ), రిసాయా అకాడమీతో భాగస్వామ్యం చేసుకుంది. అమెరికాలోని ఎన్ఏయూ క్యాంపస్లో భారతీయ విద్యార్థులకు ఒక ప్రత్యేకమైన విద్యాఅనుభవాన్ని అందిస్తామని యూనివర్సిటీ తెలిపింది. మల్లారెడ్డి విశ్వవిద్యాలయం కూడా ఈ ఒప్పందంలో భాగమైంది. కంప్యూటర్ ఇంజనీరింగ్, ఇమ్మర్సివ్ మీడియాలో అత్యాధునిక కోర్సులను బోధిస్తామని ఎన్ఏయూ ప్రకటించింది. ఇంటెన్సివ్ సమ్మర్ ప్రోగ్రామ్.. కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బ్లాక్ చెయిన్, ఏఐ/ఎంఎల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) వంటి కోర్సులు చదువుతున్న వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొంది.

## అంతారంలో కుటుంబంపై విచక్షణ రహిత దాడి

**- బాధితులకు తీవ్ర గాయాలు**

**పరిగి** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం అంతారం గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. ఓ చిన్న పిల్లోడిని బెదిరించారని అడిగేందుకు వెలితే ఆ కుటుంబం పై చిన్న పెద్ద తేడాలేకుండా కర్రలతో గొడ్డళ్లతో దాడిచేశారు. చరణ అనే బాలుడు నీళ్లకోసం వెలితే గడ్డపరాతో చంపుతానని బెదిరించాడని తన ఇంట్లో తల్లి పావనికి వచ్చి చెప్పాడు .పావని తన భర్తతో పిల్లోడిని గడ్డపారతో చంపుతానని బెదిరించినట్లు చెప్పడంతో ఆ విషయంపై మరో వర్గానికి చెందిన రాములు ను అడిగేందుకు వెల్లారు. ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి చిలికి చిలికి గాలివానలా పెద్ద గొడవకు దారితీసింది. ఇదంతా పాత కక్షలు మనసులో పెట్టుకున్న రాములు ,టిచర్ బసయ్యలు ఎలాగైనా చంద్రమౌళి కుటుంబీకులటై దాడి చెయ్యాలని నిర్ణయించుకున్నారు.చిన్నపిల్లాడిపై మీ ప్రతాపమా అని నిలదీసి తన ఇంటికి వెళ్లిపోయాడు చంద్రమౌళి.తిరిగి చంద్రమౌళి ఇంటిదగ్గర మళ్లి మొదలైన గొడవకు దిగారు రాములు కుటుంబ సభ్యులు. ఈ గొడవంతా ఒకే గ్రామానికి చెందిన రెండు కుటుంబాల మధ్య జరిగింది.ఒకే గ్రామానికి చెందిన ఓ వర్గం రాములు, బసయ్య టిచర్ పది మందితో కలసి చెంద్రమౌళి ఇంటి దగ్గర కుటుంబ సభ్యులపై కర్రలతో గొడ్డళ్లతో దాడి చేశారని చంద్రమౌళి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.చంద్రమౌళి కుటుంబానికి చెందిన 8 మంది పై కర్రలతో, గొడ్డళ్లతో ,రాడ్లతో ప్రత్యార్థులు దాడి చేశారని తమ కుటుంబ సభ్యులకు తీవ్రగాయాలైనట్లు తెలిపారు.నారాయణమ్మ (48) చంద్రమౌళి (45) ల తలలపై గోడ్డళ్లతో దాడి చెయ్యడంతో వారిద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వారి కుటుంబ సభ్యులు లావణ్య (30) అక్షయ (16) శ్రీకాంత్ (32) చరణ్ (18) వెంకటరాములు (40) పావని (35) లకు తలలకు చేతుల్లకు , కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాలతో కుల్కచర్ల పోలీస్టేషన్ కు వెలితే ముందుగా ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని ఎస్సై సూచించి పంపించేశాడు. తీవ్రగాయాలు అయిన చంద్రమౌళి తన కుటుంబ సభ్యులతో పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకున్నారు.గొడ్డళ్లతో దాడి చెయ్యడం వల్లా చంద్రమౌళి, తన అక్క నారాయణమ్మ లకు తలలకు తీవ్రంగా గాయాలైయ్యాయి.ఈ గోడవలకు పాత కక్షలే కారణమని గతంలో కూడా ఈ కుటుంభం పై ప్రత్యార్థి రాములు కుటీంబీకులు దాడి చేసినట్లు తెలిపారు.

## వీరాంజనేయ స్వామికి అభిషేక కార్యక్రమం



**మహేశ్వరం** మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల్ గట్టుపల్లి లోని ప్రసిద్ధిగాంచిన వీరాంజనేయ స్వామి ఆలయంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ కలిసి స్వామివారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంతో మహిమ గలిగిన ఆలయ ప్రాంగణంలో ఒక అన్యమతస్తుడు మేకను బలిచ్చి ఆలయ ప్రాంగణాన్ని అపవిత్రం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ ప్రక్షాళనలో భాగంగా ఈరోజు అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించామని తెలియజేశారు. నియోజకవర్గంలో హిందువులకు ఇంత అన్యాయం జరుగుతున్న కాంగ్రెస్ మరియు బిఆర్ఎస్ పార్టీల నాయకులు ఇప్పటివరకు స్పందించకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని, హిందువులంతా వారిని గమనిస్తున్నారని సమయం వచ్చినప్పుడు వారికి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పాపయ్య గౌడ్
జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి , పార్లమెంట్ కో కన్వీనర్ అనంతయ్య గౌడ్ , అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి ,విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, వివిధ క్షేత్ర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి పై కేసు నమోదు చేయాలి

**- ఎస్పీని కలిసిన మాజీ మంత్రి జోగు రామన్న**

**అదిలాబాద్** మొట్టమొదటిసారి ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిపై ఆదిలాబాద్ లో కేసు నమోదు చేయాలనీ ఎస్పి గౌస్ అలం ను మాజీ మంత్రి జోగు రామన్న కోరారు. బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చీటింగ్ కేసులు నమోదు చేయాలనీ మాజీ మంత్రి, బీ.ఆర్.ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉట్నూర్ లో బీ.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిబీత్ పై కేసులు నమోదు చేయడాన్ని ఎస్పీ వద్ద ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి... వాటిని నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమయిందని, ప్రజలను మోసం చేసిన సీఎంపై చీటింగ్ కేసులు నమోదు చేయాలనీ కోరారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ.... ఎన్నికల వేళ అనేక బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రిపై చీటింగ్ కేసులు నమోదు చేయాలనీ కోరారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అభ్యంతరకరం, వెంటనే చర్యలు తీసుకోండి

**హైదరాబాద్** ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్ రెడ్డి మా నాయకులు కెసిఆర్,కేటీఆర్,హరీష్ రావులను బెదిరిస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తూ చేస్తున్న వ్యాఖ్యలు భయం గొలుపేలా ఉన్నాయని, తెలంగాణ సమాజానికి ఇవి తీవ్ర అభ్యంతరకరమని వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన బి ఆర్ ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్,గెల్లు శ్రీనివాస్. పెద్ద ఎత్తున తరలివచ్చిన బిఆర్ఎస్ కార్యకర్తలతో బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్ కి వచ్చిన నాయకులు. మా నాయకులకు ఎలాంటి హాని వాటిల్లిన ఇది కేవలం కాంగ్రెస్ నాయకులు రేవంత్ రెడ్డి బాధ్యతేనని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కారు అదుపు తప్పి ప్రమాదం

**రాజన్న సిరిసిల్ల** వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న మూడు ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోని స్విఫ్ట్ డిజైర్ కార్ ఢీకొట్టింది. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్టు సమాచారం. ఈ ఘటనలో ఎవరికి ఏం ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకునన్ఆరు. డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని పోలీసులు బ్రీత్ అనలైజర్ తో టెస్టులు నిర్వహించారు.



# హస్తం గూటికి మరో ఎమ్మెల్యే?

**మహబూబ్ నగర్ :** అన్ని నియోజకవర్గాల్లో ఓ లెక్క అక్కడ ఓ లెక్క అన్నట్టు కొనసాగుతుంది అక్కడ పరిస్థితి. ఎక్కడైనా ఎమ్మెల్యేలు క్యాంప్ ఆఫీసులో కనిపిస్తారు కానీ ఆ ఎమ్మెల్యే నియోజకవర్గంలో క్యాంపు ఆఫీసు ఉన్న సంగతే మరిచిపోయినట్లు వ్యవహరిస్తున్నారు. క్యాంపు ఆఫీసులో కార్యకలాపాలు కలిసి రావన్న సెంటిమెంట్‌లో ఆ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను ఏకంగా పాడు పెట్టేస్తున్నారు. దీంతో ఆయన్ని కలవడానికి నియోజకవర్గ ప్రజలు సరిహద్దు దాటి పక్క రాష్ట్రం పోవాల్సి వస్తుందంట. నియోజక వర్గం కంటే నాకు ఇక్కడే కంఫర్ట్ అన్నట్లు వ్యవహరిస్తున్న ఆ గులాబీ పార్టీ ఎమ్మెల్యే ఎవరు?గద్వాల జిల్లాలోని అలంపూర్ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజక వర్గం నుంచి గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి విజయుడు గెలుపొందారు. అప్పటి వరకు కొనసాగిన సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహంను కాదని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సూచించిన వ్యక్తికి గులాబీ బాస్ టికెట్ కేటాయించారు. వెంకట్రామిరెడ్డి అనుచరుడు, ఎలాంటి రాజకీయ అనుభవం లేని ఫీల్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న విజయుడుకి టికెట్ ఇచ్చారు. వెంకట్రామిరెడ్డి అన్ని తానై వ్యవహరించి విజయుడిని గెలిపించుకున్నారు.ఇంత వరకు బాగానే ఉంది . గెలిచిన విజయుడు నియోజక వర్గంలోని అలంపూర్ క్యాంప్ ఆఫీస్ వైపు తొంగి కూడా చూడకపోవడంపై నియోజక వర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే నివాసంతో పాటు , ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో గత కేసిఆర్ ప్రభుత్వంలో క్యాంపు ఆఫీస్ ల నిర్మాణం జరిగింది . అయితే క్యాంప్ ఆఫీస్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన గులాబీ పార్టీ ఎమ్మెల్యే విజయుడు మాత్రం పక్క రాష్ట్రమైన , కర్నూలు లోని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కాంపౌండ్ నే తన కేరాఫ్ అడ్రస్‌గా మార్చుకోవడం చర్చనీయాంశంగా మారింది.దాంతో తమ అవసరాల కోసం ఎమ్మెల్యేను కలవాల్సిన వారంతా రాష్ట్ర సరిహద్దు దాటి కర్నూలు పోవాల్సి వస్తుంది. కర్నూలులోని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి నివాసంలో ఎమ్మెల్యే విజయుడి కోసం ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించడంతో అలంపూర్ నియోజక వర్గం పాలన అంతా ఆ గది కేంద్రంగా కొనసాగుతోంది.

ప్రభుత్వ పథకాలు తీసుకోవాలన్నా.., తమ బాధలు చెప్పుకోవాలన్నా, నియోజక వర్గం లోని ఆయా మండలాల నుంచి కర్నూలులోని చల్లా కాంపౌండ్ బాట పట్టాల్సివస్తుందని ప్రజలు వాపోతున్నారు.కర్నూలు పట్టణం నియోజక వర్గానికి సరిహద్దు ప్రాంతం అయినప్పటికీ వివిధ మండలాల నుంచి కర్నూలు వెళ్లడమనేది వ్యయ ప్రయాసలతో కూడిన అంశమే. నియోజక వర్గంలో క్యాంప్ ఆఫీస్ కేంద్రంగా పాలన ఉంటే అన్నింటికి సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. అదలా ఉంటే అలంపూర్ చౌరస్తా లో లక్షల వ్యయంతో నిర్మించిన క్యాంప్ ఆఫీస్ నుంచే మాజీ ఎమ్మెల్యే అబ్రహం కార్యకలాపాలు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే వారు . క్యాంప్ ఆఫీస్ కేంద్రంగా సిబ్బంది నియామకం చేపట్టి , వివిధ మండలాల నుంచే వచ్చే వారి నుంచి వినతులు , దరఖాస్తులు స్వీకరించి అక్కడి నుంచే ప్రభుత్వ పథకాల పంపిణీ చేపట్టే వారు.అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహంకు టికెట్ దక్కక పోవడంతో చల్లా ఆశీస్సులతో విజయుడు టికెట్ దక్కించుకుని గెలుపొందారు . అబ్రహంకు క్యాంప్ ఆఫీస్ కలిసి రాక పోవడం వల్లనే అలా జరిగిందని , అక్కడి నుంచి ఎమ్మెల్యే పాలన వ్యవహారాలు నడిపిస్తే తనకు కూడా భవిష్యత్ ఉండదనే సెంటిమెంట్‌తో ఎమ్మెల్యే విజయుడు క్యాంప్ ఆఫీస్ వైపు కూడా తొంగి చూడటం లేదని గులాబీ శిబిరం లో చర్చ సాగుతుంది.

అదేమి కాదు , అన్నీ తానై వ్యవహరించి టికెట్ ఇప్పించుకొని గెలిపించుకున్న ఎమ్మెల్సీ చల్లా.. ఎమ్మెల్యే విజయుడు మరో పవర్ పాయింట్‌లా తయారవుతారనే ముందు జాగ్రత్తతో ?తన పర్యవేక్షణ లో కార్యకలాపాలు కొనసాగేలా జాగ్రత్త పడ్డారని మరికొందరు చర్చించుకుంటున్నారు.ఇక ఇదే సమయంలో నియోజకవర్గం లో పాలన వ్యవహారాల్లో అన్ని కీలక నిర్ణయాలకు సంబంధించి ఎమ్మెల్సీ చల్లా గ్రీన్ సిగ్నల్ తరువాతే ఎమ్మెల్యే విజయుడు ఒకే చెప్తారు. త్వరలో వీరు గులాబీ గూటికి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ లో చేరాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఎలాంటి రాజీకీయ అనుభవం లేని విజయుడు.. భవిష్యత్‌పై భరోసా లేకున్నా చల్లా వెంకట్రామిరెడ్డి నిర్ణయాన్ని కాదన లేకపోతున్నారంట.మొత్తం మీద గత పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో జనాలతో కళకళలాడిన అలంపూర్ క్యాంప్ ఆఫీస్ , ఇప్పుడు ఆఫీసుకు వచ్చే వారు లేక వెలవెలబోతోంది . లక్షల రూపాయల ప్రజా ధనం తో నిర్మించిన ఆ భవనాన్ని వినియోగంలోకి తేవాలని. భవనానికి ఏదైనా వాస్తు దోషం ఉంటే మరమ్మత్తులు చేయించుకుని.. ఎమ్మెల్యే నియోజక వర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని స్థానికులు కోరుతున్నారు. మరి ఎమ్మెల్యే రిమోట్ తన చేతిలో పెట్టుకున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి దీనిపై ఎలా రియాక్ట్ అవుతారో? చూడాలి.

# మూసీ ఆందోళనలు...ప్లాన్ చేస్తున్న ప్రతిపక్షాలు

**హైదరాబాద్ :** గ్రేటర్ రాజకీయాల్ని మూసీ నది అంశం అట్టుడికిస్తుంది . లోక్‌సభ ఎన్నికల్లో ఖాతా తెరవలేకపోయిన బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో సత్తా చాటుకోవడానికి మూసీ అంశాన్ని ప్రధానాస్త్రంగా మార్చుకున్నట్లు కనిపిస్తుంది . మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సైతం అదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలకు దిగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మూసీ ప్రక్షాళన జరగాల్సిందే అని విపక్షాలకు సవాళ్లు విసురుతుండటం చర్చనీయాంశంగా మారిందితెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీకి కోలుకోలేని ఎదురు దెబ్బ తగిలింది. 39 స్థానాలకే పరిమితమైన బీఆర్ఎస్‌కు గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రమే ఊరట లభించింది. గ్రేటర్లో అధికార కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యమే లభించలేదు. బీజేపీ సైతం గోషామహల్ సీటుతోనే సరిపెట్టుకుంది. ఎంఐఎం గెలుపొందిన స్థానాలు మినహా అన్నీ బీఆర్ఎస్ సొంతం చేసుకుంది. తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యే అకాల మరణంతో కంటోన్మెంట్ సెగ్మెంటుకి జరిగిన బైపోల్స్‌లో కాంగ్రెస్ ఖాతా తెరిచి బీఆర్ఎస్ సిట్టింగు సీటుని గల్లంతు చేసింది. అప్పటికే ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ మంత్రి దానం నాగేందర్ కాంగ్రెస్ పంచకు చేరారు.మరికొందురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ని వీడడానికి రెడీగా ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ తాను పార్టీ మారలేదని బహిరంగ ప్రకటన చేసినా.. ఆయన పార్టీ మారిపోయారని గులాబీ నేతలే రచ్చ చేస్తున్నారు. ఇలాంటి గందరగోళ పరిస్థితుల మధ్య గ్రేటర్లో పార్టీ పట్టు నిలుపుకోవడం బీఆర్ఎస్‌కు ప్రతిష్టాత్మకంగా తయారైంది.. ఆ క్రమంలో జీహెచ్ఎంసీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో తమ ఉనికి కోసం పాకులాడుతున్న గులాబీ పెద్దలకు మూసీ, హైడ్రా అంశాలు అయాచిత వరాలుగా మారాయి.మూసి అంశాన్నే బేస్ చేసుకుని బీఆర్ఎస్ రాజకీయం చేయాలని చూస్తుంది. హైదరాబాద్ శ్రేయస్సు, భవిష్యత్తు అవసరాల కోసం మూసీ ప్రక్షాళన జరగాలని కాంగ్రెస్ సర్కారు పట్టుదలతో ఉంది. అయితే అది ప్రక్షాళన కాదు మూసీ సుందరీకరణ అంటూ, ప్రభుత్వ పెద్దలు రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసమే ఇదంతా చేస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుంది. అయితే మూసి రీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు అయింది బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే.. ఆ విషయాన్ని తెరమరుగు చేసే విధంగా మూసీ బాధితులకు అండగా నిలుస్తామంటూ గులాబీ నేతలు హడావుడి మొదలుపెట్టారు.ఇప్పటికే మూసీ పరివాహక ప్రాంతంలో బాధితుల పరామర్శ పేరుతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల వరకు మూసీ అంశాన్ని రగిలిస్తూనే ఉండాలని . మూసీ పరివాహక ప్రాంత నియోజకవర్గ ఎమ్మెల్యేలు రోజుకొకరు ఆ ప్రాంతాల్లో పర్యటించాలని బీఆర్ఎస్ ఆదేశాలు జారీ చేసింది. ఇదే అంశంపై గ్రేటర్ పరిధిలో భారీ బహిరంగసభ పెట్టేందుకు ప్లాన్ చేస్తుంది గులాబీ పార్టీ.మరోవైపు బీజేపీ కూడా మూసీ అంశంతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తుంది.

ఈ నెల 23, 24న మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకంగా ఎంపీ, ఎమ్మెల్యేలతో మూసి పరీవాహక ప్రాంతాలలో పర్యటిస్తామని, అలాగే 25 న పెద్ద ఎత్తున ధర్నా చేయబోతున్నట్లు బీజేపీ ప్రకటించింది. ఇప్పటికే మూసీ పరివాహక ప్రాంతాల్లో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ వంటి ముఖ్యనేతలందరూ పర్యటిస్తున్నారు.గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో రెండో స్థానాన్ని దక్కించుకున్న బీజేపీ.. ఈసారి మేయర్ పీఠం సాధించేలా పావులు కదుపుతుంది. అందులో భాగంగానే మూసీ అజెండాగా ప్రజల్లోకి వెళ్లుతూ.. మేజార్టీ స్థానాలను సాధించాలనే లక్ష్యంతో కార్యచరణ సిద్ధం చేసుకుంటున్నట్లు కనిపిస్తుంది. మొత్తానికి గ్రేటర్ ఎన్నికల పుణ్యమా అని మూసీ వ్యవహారమే అన్ని పార్టీలకు పొలిటికల్ అజెండాగా మారిందిప్పుడు.

## తలలు పట్టుకుంటున్న
# పత్తి రైతులు

**కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా జమ్మికుంట కాటన్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు గత వారం నుండి కొత్త పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. అయితే..ఇప్పుడు..ఇప్పుడే పత్తి మార్కెట్‌లోకి వస్తుంది. అయితే..పత్తికి కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.. క్వింటల్‌కు రూ.7521 ప్రభుత్వం ప్రకటించింది.అయితే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కూడా కొనుగోలు చేయడం లేదని రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాణ్యత పేరుతో 7 వేల లోపే కొనుగోలు చేస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. అయితే గత సంవత్సరంతో పోలిస్తే పత్తి ధరలు తక్కువగా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదంటూ ఆందోళన చెందుతున్నారు. కూలి రేట్లు పురుగుమందుల ధరలు ఎరువుల ధరలు అధికంగా పెరిగిపోయాయి. అంతేకాకుండా ప్రతికూల వాతావరణంతో దిగుబడి తగ్గింది. మద్దతు ధర రూ.8 వేల నుంచి 9వేల వరకు ఉండే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రైతుల కోరుతున్నారు. అయితే మార్కెట్లో ఇప్పటికీ సీసీఐ కొనుగోలు ప్రారంభించలేదు. టెండర్లు పూర్తి అయ్యాయని 10 కాటన్ మిల్లులలో సీసీఐ కొనుగోలు వారం రోజుల్లో ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రైవేట్ వ్యాపారులు ఇష్టరాజ్యంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరతో పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు చెబుతున్నారు. మెజారిటీ మార్కెట్లలో ఇంకా పత్తి కొనుగోలు చేయలేదు. పత్తి ధర తగ్గడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రబీకే రుణమాఫీ...

**నిజామాబాద్ :** వానాకాలం సీజన్ పంట పెట్టుబడి సాయంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే సీజన్ రబీ నుంచే రైతు భరోసా ఇస్తామని చెప్పారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన? ఈ ఖరీఫ్ సీజన్ కు పంట పెట్టుబడి సాయం ఉండదని ఓ ప్రశ్నకు జవాబునిచ్చారు.రైతు భరోసా స్కీమ్ పై మంత్రి ఉపసంఘం ఏర్పాటు చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. సబ్ కమిటీ నివేదిక వచ్చిన తర్వాతే.. స్కీమ్ ను అమలు చేస్తామని ప్రకటించారు. అంటే ఈ సీజన్ కు రైతు భరోసా ఉండబోదని? వచ్చే సీజన్ రబీ నాటికి పంట పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. అర్హత ఉన్న రైతుకు ప్రతి ఎకరానికి రూ. 7500 చెల్లిస్తామని పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రక్రియలో ఇప్పటికే రైతులకు రుణమాఫీ కాగా...పలు సాంకేతిక కారణాలతో పలువురికి రుణమాఫీ నిలిచిపోయింది. రుణమాఫీ కాని వారి సమస్యలు పరిష్కరించి...అర్హులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అయ్యేలా చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ మేరకు అధికారులు సాంకేతిక అడ్డంకులు తొలగించే పనిలో ఉన్నారు. మరో 15 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రభుత్వంలోని మంత్రులు ప్రకటనలు చేస్తున్నారు.

ఇదే విషయంపై ఇటీవలే మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. అక్టోబర్ 31 నాటికి రూ.2 లక్షలలోపు రుణాలు ఉన్న, అర్హులైన వారందరికీ రుణమాఫీ పూర్తి చేస్తామని స్పష్టమైన ప్రకటన చేశారు. నవంబర్ 1 నుంచి రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలున్న రైతుల రుణమాఫీపై ప్రక్రియ చేపడతామన్నారు. దీంతో రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతులు... ముందుగా పైన ఉన్న రుణాన్ని అక్టోబర్ 31లోపు క్లియర్ చేసుకోవాల్సి ఉంటుంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మొదటి పంట కాలంలోనే రూ.31 వేల కోట్ల రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం నల్లగొండలో మాట్లాడిన మంత్రి?ఇప్పటి వరకూ 22 లక్షల రేషన్ కార్డులు కలిగిన రైతులకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ నగదు ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ నెలాఖరు నాటికి రేషన్ కార్డులు మిగిలిన 4 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు. రూ.2 లక్షల పైన రుణాల మాఫీపై షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. ఎట్టి పరిస్థితులలో ఈ పంట కాలంలోనే రూ.31 వేల కోట్లు రుణమాఫీ చేసి తీరుతామని తుమ్మల స్పష్టం చేశారు.

## సన్నాల సమస్య..
# మిల్లింగ్ కుససేమిరా

**కరీంనగర్ :** సన్న వరి ధాన్యం సమస్యగా మారుతుంది. ప్రభుత్వం క్వింటాలకు రూ.500 బోనస్ సన్నాలకు ఇస్తామని ప్రకటించడంతో ఖరీఫ్ సీజన్లో ఎక్కువ మంది రైతులు సన్న వరి సాగు చేశారు.ప్రస్తుతం పంట చేతికి అందడంతో అమ్ముకోవడానికి ఇబ్బంది లేకపోయినప్పటికీ మిల్లింగ్ చేసేందుకు మిల్లర్స్ ససేమిరా అంటున్నారు.తెలంగాణలో సన్న వరి సాగు కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. సాగు పెరగడంతో క్వింటాకు 67 శాతం బియ్యం ఇవ్వలేమని మిల్లర్లు చేతులెత్తేస్తున్నారు. మిల్లింగ్ నిబంధనలు సడలించి క్వింటాకు కొంత పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్ కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు. మిల్లర్ల మెలికతో సన్నధాన్యం సేకరణ సమస్యగా మారుతుంది.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వానాకాలం సీజన్లో 11.75 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు.

20.59 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనాకొచ్చారు. ఇందుకోసం 1,360 కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు.ఈసారి 31 రకాల సన్నధాన్యాన్ని పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మునుపెన్నడూ లేని విధంగా వానాకాలం సీజన్లో అత్యధిక శాతం సన్నాలు సాగు చేశారు. ఉమ్మడి జిల్లాలో 3,90,967 ఎకరాల్లో సన్నాలు సాగైంది. కరీంనగర్ జిల్లాలో 2,48,623 మెట్రిక్ టన్నులు, జగిత్యాలలో 1,72,150 మెట్రిక్ టన్నులు, పెద్దపల్లిలో 3.44 లక్షల మెట్రిక్ టన్నులు, రాజన్న సిరిసిల్లలో 28,457 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాకొచ్చారు.మొత్తంగా 7.93 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని ప్రత్యేక కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు సిద్ధం చేశారు.

సన్నాలకు కేంద్రం క్వింటాల్ కు రూ.2,320 మద్దతు ధర చెల్లిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ కలిపి రూ.2,820 చొప్పున కొనుగోలు చేయనుంది.సన్నాళ్లకు బోనస్ ప్రకటించిన ప్రభుత్వం, ఐకెపి, సహకార సంఘాలు ద్వారా కొనుగోలు చేసి మిల్లర్స్ కు అప్పగించి మిల్లింగ్ చేశాక ప్రభుత్వమే తీసుకోనుంది. దొడ్డు ధాన్యంతో వచ్చే బియ్యాన్ని ఎఫ్సీఐ (భారత ఆహార సంస్థ)కు వెళతాయి. అయితే సన్నధాన్యాన్ని మిల్లింగ్ చేశాక వచ్చే బియ్యాన్ని వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు, సంక్షేమ వసతి గృహాలకు ఉపయోగించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.కానీ సన్న ధాన్యం మిల్లింగ్ కు మిల్లర్లు ససేమిరా అనడంతో ఆ సమస్య పరిష్కారం అయిన తర్వాతే సన్నధాన్యం కొనుగోలు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. నిబంధనలు సడలించాలని రా రైస్ మిల్లర్స్ కోరుతున్నారు.సాధారణంగా దొడ్డు రకం దాన్యం మిల్లింగ్ చేస్తే క్వింటాకు 67 కిలోల బియ్యం వస్తాయి. అదే సన్న రకం ధాన్యం మిల్లింగ్ చేస్తే 57 కిలోలకు మించి బియ్యం రావని మిల్లర్లు అంటున్నారు. దొడ్డు, సన్నాలకు చెందిన ఏ రకం ధాన్యం మిల్లింగ్ చేసినా క్వింటాకు రూ.67 కిలోల బియ్యం సీఎంఆర్ కింద అప్పగించాల్సి ఉంటుంది.సన్నరకాలను తీసుకొని మిల్లింగ్ చేస్తే క్వింటాకు 10 కిలోల బియ్యం తక్కువగా వస్తుందని, ఈ లోటును ఎవరు భరిస్తారని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు. పైగా 17 శాతం తేమ ఉన్న సన్నరకం ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటే 20 రోజుల్లో రంగు మారిపోయే ప్రమాదం ఉందని, ఇవే బియ్యాన్ని మిల్లింగ్ చేస్తే బియ్యం తీసుకునే సమయంలో నాణ్యత లేదంటూ అధికారులు కొర్రీలు పెడితే తాము నష్టపోతామని వాపోతున్నారు.అందుకే తేమ నిబంధనను 17 నుంచి 14 శాతానికి తగ్గించాలని.. సన్న బియ్యం సరఫరాలో క్వింటాకు రూ.300 పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్ కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు. క్వింటాకు ఎన్ని కిలోల బియ్యం వచ్చినా తీసుకునేలా నిబంధన సడలించాలని కోరుతున్నారు. దీంతోపాటు 20 ఏళ్లుగా మిల్లింగ్ చార్జీలు పెంచకపోవడంతో అనేక సమస్యల తమను వేధిస్తున్నాయని అంటున్నారు.రారైస్ క్వింటాకు రూ.30 చెల్లిస్తున్నారని, పెరిగిన విద్యుత్తు ఛార్జీలు, కార్మికుల కూలీలు కలిపితే తమకు అసలే గిట్టుబాటు కావడం లేదంటున్నారు మిల్లర్లు. ప్రభుత్వం నుంచి ఇంకా ఏ నిర్ణయం రాకపోవడంతో సన్నాల కొనుగోళ్ళు ఇంకా జరగడం లేదు. ప్రైవేట్ ట్రేడర్స్, వ్యాపారులు సన్నాలను తక్కువ ధరకు రైతుల నుంచి కొనుగోలు చేసి సొమ్ము చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

## కాంగ్రెస్‌కు దొరికేసిన
# ట్రబుల్ షూటర్

**హైదరాబాద్ :** పీసీసీ చీఫ్ అంటే.. పార్టీకే పరిమితం. కార్యకర్తలు, నేతల సమావేశం..పేరుకే అధ్యక్షుడు అన్నట్లుగా ఉండేది పరిస్థితి. కానీ మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యాక..పదవిని బాధ్యతగా ఫీల్ అవుతున్నారట. ప్రభుత్వ విషయాల్లో జోక్యం చేసుకోకుండా..పార్టీలో సీనియర్లను నొప్పించకుండా వ్యవహారాలను చక్కబెట్టే ప్రయత్నం చేస్తున్నారట.పీసీసీ చీఫ్‌గా మహేశ్ గౌడ్ చేసిన ఒక ప్రయత్నం.. ప్రతి వారం ఇద్దరు మంత్రులు గాంధీభవన్‌కు వచ్చేలా చేసింది. సామాన్య కార్యకర్తలు, కిందిస్థాయి నేతలు మంత్రులను కలవడానికి చాలా ఇబ్బంది పడేవారు. గాంధీభవన్‌కు మంత్రులు వస్తుండటంతో నేరుగా వారిని కలిసి సమస్యలు చెప్పుకుంటున్నారు. దీంతో పార్టీ క్యాడర్‌కు ప్రభుత్వం దగ్గరైందన్న ఫీలింగ్ కలుగుతుందంటున్నారు హస్తం నేతలు.పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చొరవతో చాలామంది గాంధీభవన్ మెట్లెక్కి సమస్యలు చెప్పుకుంటున్నారు. పార్టీ ఆఫీస్‌కు వచ్చేవారి విషయంలో కూడా మహేశ్ గౌడ్ సానుకూలంగా స్పందిస్తూ.. పరిష్కార మార్గం చూపిస్తున్నారు. జీవో 317తో ఇబ్బంది పడుతున్న ఉద్యోగుల అంశం విషయంలో పీసీసీ చీఫ్ చొరవ తీసుకొని మంత్రులను గాంధీభవన్‌కు పిలిచి చర్చలు జరిపేలా చేశారు.అక్టోబర్ 2న జీవో 317కు సంబంధించిన బాధిత ఉద్యోగులు గాంధీభవన్ ముట్టడికి వచ్చారు. కానీ వారిని లోపలికి పిలిచి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలతో చర్చలు జరిపించారు. ఉద్యోగుల ఇబ్బందులను కచ్చితంగా పరిష్కారం చూపుతామని సర్దిచెప్పారు.లేటెస్ట్‌గా జీవో 29 విషయంలో గ్రూప్-1 అభ్యర్థులు పెద్దఎత్తున ఆందోళన చేశారు. కొందరు అభ్యర్థులు గాంధీభవన్ ముట్టడికి వస్తే వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ జోక్యం చేసుకొని వారిని వదలిపెట్టాలని పోలీసులకు సూచించడమే కాకుండా.. గాంధీభవన్‌కు పిలిచి గ్రూప్-1 అభ్యర్థుల సమస్యలు విన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చి..మంత్రులను స్వయంగా కలిసి జీవో 29పై చర్చలు జరిపారు. ఒక బీసీ బిడ్డగా రిజర్వేషన్ల విషయంలో నష్టం జరిగితే ఊరుకోనని.. ఎలాంటి నష్టం జరగదని భరోసా ఇచ్చారు.ఏ సమస్య వచ్చినా తన భుజాన వేసుకొని పరిష్కారం చూపుతున్నారు పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్. ప్రతిపక్షాల విమర్శలను కూడా తిప్పికొట్టే ప్రయత్నం చేస్తున్నారు. హైడ్రా, మూసీ వంటి విషయంలో పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి అండగా ఉంటూ విపక్షాలను ఎండగడుతున్నారు. పైగా ప్రభుత్వానికి..పార్టీకి మధ్య అనుసంధాన కర్తగా వ్యహరిస్తూ..అన్ని తానై పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు

# గుత్తా వర్సెస్ కోమటిరెడ్డి
## - ఆధిపత్య పోరులో నేతలు

**నల్గొండ :** ఆయన మంత్రి.. ఈయనేమో అధికార పార్టీతో సన్నిహితంగా ఉండే విపక్ష నేత. ఈ ఇద్దరు ఒకప్పుడు మాటలను తూటాల్లా వాడుకున్నవాళ్లే ! అలాంటిది ఇప్పుడు ఇద్దరి మధ్య యుద్ధం మొదలైంది. అది అలాంటి ఇలాంటి వార్ కాదు.. ఆధిపత్య పోరు. వాళ్లే మంత్రి కోమటిరెడ్డి.. మండలి ఛైర్మన్ గుత్తా. ఇంతకీ ఇద్దరి మధ్య ఏం జరిగింది.. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయ్. జంపింగ్ జపాంగ్‌లు పెరిగిపోయాయ్. అధికార కాంగ్రెస్‌లో చేరడమో.. అనుకూలంగా ఉండటమో చేస్తున్నారు నేతలు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ అయి మండలి ఛైర్మన్ గా ఉన్న గుత్తా సుఖేందర్ రెడ్డి.. కాంగ్రెస్లో చేరకపోయినా.. కాంగ్రెస్‌కు అనుకూలంగా మారిపోయారు.ఆయన కుమారుడు అమిత్ రెడ్డి.. కాంగ్రెస్‌లో చేరి కార్పొరేషన్ ఛైర్మన్ అయిపోయారు. నల్లగొండ జిల్లా సీనియర్ నేత కావడంతో.. ఆయనకు మొదట్లో మంచి గౌరవం దక్కేది. దీంతో జిల్లాకు గుత్తా రెగ్యులర్‌గా ట్రిప్‌లు వేసేవారు. ఐతే కొంతకాలంగా పరిస్థితి మారింది. పెద్దాయన ట్రిప్‌లకు బ్రేక్‌లు పడుతున్నాయ్. మంత్రి కోమటిరెడ్డితో విభేదాలు మొదలయ్యాయనే చర్చ మొదలైంది. దీంతో నల్లగొండ పాలిటిక్స్‌లో ముసలం పుట్టింది.గుత్తా రెగ్యులర్‌గా నల్లగొండలో పర్యటనలు చేస్తుండడంతో.. కాంగ్రెస్ కార్యకర్తల్లో అభద్రతా భావం పెరిగింది. ఇక నల్గొండ వెళ్లిన ప్రతిసారి.. తన అనుచరులను చేరదీసుకొని.. వారికే ప్రయారిటీ ఇవ్వడం మొదలుపెట్టారు గుత్తా. పోలీస్‌స్టేషన్, తహశీల్దార్ ఆఫీసులకు ఫోన్ చేసి.. అనుచరుల పనులు చేయిస్తున్నారు. అటు కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రిగా ఉండడంతో.. ఆయన ఎక్కువగా హైదరాబాద్‌కే పరిమితం అవుతున్నారు. దీంతో కార్యకర్తలకు అంతగా సమయం కేటాయించలేకపోతున్నారు.జిల్లాలో గుత్తా సుఖేందర్ రెడ్డి ద్వారా.. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న నేతలవే పనులు అవుతున్నాయ్.

ఈ వ్యవహారం అంతా తీసుకెళ్లి మంత్రి దగ్గర పంచాయతీ పెట్టారు కార్యకర్తలు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా.. తమ పనులు కావడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. గుత్తాకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందేనంటూ మంత్రిని వేడుకున్నారట. దీంతో ఇంకేముంది కోమటిరెడ్డి వెంకటరెడ్డి రంగంలోకి దిగారు.గుత్తాకు చెక్ పెట్టేందుకు.. తమ చేతికి మట్టి అంటకుండా.. జిల్లా ఎస్పీని మంత్రి కోమటిరెడ్డి రంగంలోకి దించారనే ప్రచారం జరుగుతోంది. గుత్తా సుఖేందర్ రెడ్డి మండలి ఛైర్మన్ కావడంతో.. ఆయన జిల్లాకు వచ్చినప్పుడు ప్రోటోకాల్ ప్రకారం ఎస్కార్ట్‌గా స్థానిక ఎస్ఐ, సీఐ వెళ్లడం కామన్. ఐతే జిల్లాలో పోలీస్ సిబ్బంది తక్కువగా ఉందని.. మంత్రితో సహా వీఐపీలు ఎవరు వచ్చినా పోలీస్ సిబ్బంది రావడం కుదరదంటూ.. నల్లగొండ జిల్లా ఎస్పీ ఒక లెటర్ విడుదల చేశారు.లేఖ విడుదల తర్వాత.. మండలి ఛైర్మన్ గుత్తాకు పోలీస్ ఎస్కార్ట్ ఆగిపోయింది.

ఇక్కడితో ఆగారా అంటే.. గుత్తాకు మరో షాక్ తగిలింది. గుత్తా జిల్లాకు వస్తే.. ఆయన వాహనాలకు డీజిల్ కొట్టించడం కూడా ఆపేశారట. జిల్లాలో ఉన్న పెట్రోల్ బంకులకు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని.. పెట్రోల్, డీజిల్ పోయడం కుదరదని చెప్తున్నారట. జిల్లాకు మంత్రి కోమటిరెడ్డి వచ్చినా.. ఆయనే స్వయంగా డబ్బులు పెట్టి పెట్రోల్, డీజిల్ కొట్టించుకుంటున్నారని అధికారులు సమాధానం ఇస్తున్నారు.ఇలా కోమటిరెడ్డి వర్సెస్ గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యవహారంతో? నల్గొండ జిల్లా రాజకీయాలు రసవత్తరంగా మారాయ్. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి, చెక్ పెట్టేందుకు మంత్రి కోమటిరెడ్డి చేసిన ఈ ఎత్తు ఆసక్తికరంగా మారింది.

# కలహాల కామ్రేడ్లు...

**హైదరాబాద్ :** తెలంగాణ సీపీఐ పార్టీలో నేతలది తలోదారి అయిపోయింది. సీపీఐ కేంద్ర కమిటీకి, తెలంగాణ కమిటీకి మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇందుకు హరియానా గవర్నర్ బండారు దత్తాత్రేయ నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమమే కారణమని అంటున్నారు. ప్రొఫెసర్ సాయిబాబా మరణం మీద సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఓ వీడియో విడుదల చేశారు.ఆయన మరణానికి కేంద్ర ప్రభుత్వమే కారణమని, అందులో భాగమైన దత్తాత్రేయ నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరు కాబోమన్నారు నారాయణ. సాయిబాబా ఎజెండా విషయంలో పార్టీకి భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ఆయన విషయంలో మాత్రం కచ్చితంగా మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని నారాయణ అభిప్రాయం వ్యక్తం చేశారు.ఇంత వరకు బాగానే ఉన్నా.. అది సీపీఐ స్టాండ్ అనుకుంటున్న సమయంలోనే ఈ అంశం కీలక మలుపు తీసుకుంది. దత్తాత్రేయ ఏర్పాటు చేసిన అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరుకాబోమని జాతీయ కార్యదర్శి నారాయణ చేసిన ప్రకటనతో సంబంధం లేకుండానే ఆ కార్యక్రమానికి హాజరయ్యారు సీపీఐ పార్టీ తెలంగాణ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు.ఇదే ఇప్పుడు సీపీఐ పార్టీలో కొత్త చర్చకు దారితీసింది. సీపీఐ రాష్ట్ర కమిటీ, కేంద్ర కమిటీలకు వేర్వేరు అభిప్రాయాలు ఉంటున్నాయా అన్న సందేహం మొదలైంది. ఒకే పార్టీలో ఢిల్లీ నాయకత్వం ఒకలాగా, తెలంగాణ నాయకత్వం మరోలా వ్యవహరిస్తున్నాయన్న చర్చ నడుస్తోంది. అసలు కామ్రేడ్స్ మధ్య భిన్నాభిప్రాయాలు, విరుద్ధమైన నిర్ణయాలకు కారణమేంటన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కూనంనేని సాంబశివరావు అలయ్ బలయ్‌కి వెళ్ళడంతో పాటు.. బండారు దత్తాత్రేయను ఆకాశానికి ఎత్తేయడంతో తెలంగాణ సీపీఐలో అసలేం జరుగుతోందన్న చర్చ మొదలైంది.బండారు దత్తాత్రేయ ప్రయత్నాన్ని సీపీఐ ఆహ్వానిస్తోందని కూనంనేని సాంబశివరావు చెప్పడంతోనే అసలు సమస్య మొదలైందని అంటున్నారు. దీంతో సీపీఐలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయా..లేదంటే సమన్వయ లోపామా..అన్న అనుమానాలు తలెత్తుతున్నాయట. అయితే ఈ వ్యవహారంలో నారాయణకు, రాష్ట్ర కార్యవర్గానికి మధ్య సమాచారం లోపం ఉన్నట్టు సీపీఐ నేతలు చెబుతున్నారు.ప్రొఫెసర్ సాయిబాబా విషయంలో సీపీఐ జాతీయ నాయకత్వం తరఫున నారాయణ తన అభిప్రాయాన్ని చెప్పారని, అక్కడే సమాచార లోపం ఉన్నట్టు చెబుతున్నాయి పార్టీ వర్గాలు. అయితే కారణం ఏదైనా బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ కార్యక్రమం మాత్రం కామ్రేడ్స్ మధ్య భేదాభిప్రాయాలకు కారణమైంది. ఇది కేవలం సమాచారం లోపమేనా లేదంటే సీపీఐ రాష్ట్ర, కేంద్ర కమిటీల్లోని నేతల మధ్యపైకి కనిపించని విభేదాలు ఇంకేమైనా ఉన్నాయా అన్న డౌన్స్ వ్యక్తం అవుతున్నాయి.

# ఏపీలో కిక్కే కిక్కు

**నెల్లూరు :** కొత్త సీసా..కొత్త మందు..తగ్గిన రేటు. ఇక కిక్కే కిక్కు. ఏపీలో కొత్త మద్యం పాలసీ మందు బాబులకే కాదు..లిక్కర్ వ్యాపారులకు, ప్రభుత్వానికి కూడా మంచిరోజులు తీసుకొచ్చింది. గత ఐదేళ్లలో టేస్ట్ లేని మందు..నోటితో పలకలేని బ్రాండ్లు చూసి చిర్రెత్తిపోయిన మందుబాబులు..ఇప్పుడు లో కాస్ట్‌కే ప్రీమియం లిక్కర్‌ను తాగి ఎంజాయ్ చేస్తున్నారు. టెండర్లలో షాపులు దక్కించుకున్న వ్యాపారులకు కూడా మంచిగానే బిజినెస్ అవుతోంది. ఇక ప్రభుత్వానికి టెండర్ ఫీజ్ నుంచి సేల్స్ వరకు ఖజానాలో కాసులు వచ్చి పడుతూనే ఉన్నాయి.కొత్త లిక్కర్ షాపులు తెరుచుకుని వారం రోజులే అయింది. ఇప్పటికే రికార్డు స్థాయి సేల్స్ జరుగుతున్నాయి. ఏకంగా ఆరు వందల కోట్ల లిక్కర్ అమ్మకాలు జరిగినట్లు అంచనా. ఇలా తెరుచకున్నాయో లేదో.. కొత్త మద్యం షాపులు సందడిగా మారాయి. పాత బ్రాండ్ల రావడంతో పాటు..రూ.99కే క్వార్టర్ మందు దొరుకుతుండటంతో ఫుల్ ఖుష్ అవుతున్నారు మందుబాబులు.అయితే కొన్ని షాపుల్లో ఇప్పటికీ కూడా రూ.99కే క్వార్టర్ మద్యం అందుబాటులో లేదు. రూ.145కు క్వార్టర్ మద్యం అంటూ షాపుల నిర్వహకులు అమ్మకాలు చేస్తున్నారు. ఈ విషయంలో కొంత అసంతృప్తి వ్యక్తమవుతున్నా వైన్ షాపుల దగ్గర రద్దీ మాత్రం తగ్గడం లేదు.ఏపీ ఆబ్కారీ శాఖకు కాసుల మత్తు కిక్కెస్తోంది. కొత్త మద్యం పాలసీ స్టార్టింగ్‌లోనే రికార్డు స్థాయి ఆదాయం రాబడుతోంది ఆబ్కారీ శాఖ. మద్యం అమ్మకాల్లో సరికొత్త రికార్డు సృష్టిస్తోంది. కొత్త లిక్కర్ షాపులు మొదలైన వారం రోజుల్లోనే రూ.6వందల కోట్లకు పైగా విలువ చేసే సరుకు గౌడన్ల నుంచి బయటకు వెళ్లింది.రాష్ట్రంలోని మద్యం డిపోల నుంచి 6లక్షల 77వేల 511 కేసుల మద్యం, లక్షా 94వేల 261 బీర్ల కేసులు అమ్మారు. బార్ల కంటే మందు బాబులు మద్యం షాపుల వైపే వెళ్తున్నారు. ఆబ్కారీ శాఖ ప్రకటించినట్లు రూ.99లకే క్వార్టర్ పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోయినా..ఇంకా కొన్ని షాపులు ప్రారంభించనప్పటికీ..అమ్మకాలు మాత్రం భారీగానే జరుగుతున్నాయి.గతంలో ప్రభుత్వ మద్యం షాపుల్లో కొన్ని బ్రాండ్లు మాత్రమే దొరికేవి. పైగా రేట్లు కూడా ఎక్కువే. దీంతో మద్యం ప్రియులు వైన్ షాపుల కంటే బార్లకే వెళ్లేవారు. వివిధ పన్నుల పేరుతో బార్లలో క్వార్టర్ బాటిల్‌కు రూ.80 వరకు వసూలు చేసేవారు బార్ల నిర్వహకులు. గత ప్రభుత్వంలో మద్యం షాపుల కంటే బార్లకే ఎక్కువ ఆదాయం వచ్చిందని చెప్పొచ్చు.కొత్త మద్యం పాలసీలో పాత బ్రాండ్లు వచ్చేశాయ్. ప్రీమియం బ్రాండ్లు కొన్ని అందుబాటులో ఉన్నాయ్. పైగా రేట్లు కూడా తక్కువే. దీంతో బార్ల కంటే వైన్‌షాపులకే వెళ్తున్నారు పబ్లిక్. ఇలాగే కొద్ది రోజులు కొనసాగితే మందుబాబులు షాపులకు అలవాటు పడతారనే టెన్షన్ బార్ల నిర్వహకుల్లో కనిపిస్తోంది. దీంతో క్వార్టర్ బాటిల్‌పై రూ.30 వరకు తగ్గిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నారు.కొత్త మద్యం పాలసీతో ప్రభుత్వానికి అయితే ఆదాయం భారీగా పెరిగింది. టెండర్ ఫీజు రూపంలోనే ప్రభుత్వానికి దాదాపు రూ.18 వందల కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పుడు రికార్డు స్థాయి లిక్కర్ సేల్స్‌తోనూ ఆబ్కారీ శాఖ ఇన్‌కమ్ పెరిగిపోయింది. ఇలా కొత్త లిక్కర్ స్కీమ్ ఇటు జనాలకు..అటు వ్యాపారులకు..ప్రభుత్వానికి అందరికీ ఉపయోగకరంగా మారింది.

**కొత్త నిబంధనలతో చిక్కులు** ధ్రప్రదేశ్ లో కొత్త ఎక్సైజ్ పాలసీ మద్యం దుకాణదారులకు లాభాల పంట తెచ్చిపెడుతుంది. అదే సమయలో ప్రజల ఆరోగ్యాలను చెడగొడుతుంది. వైన్ షాపులు నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. చూసీ చూడనట్లు కొందరు వదలిస్తున్నారు. మరికొందరు ఎక్సైజ్ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వైన్ షాపుల్లోనే బహిరంగంగా మద్యాన్ని సేవిస్తుండటం, అనుమతి లేకుండా పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవడం, అక్కడే బార్ తరహా వాతావరణం నెలకొల్పడంతో తాగుబోతులను ఆకట్టుకునేందుకు ఎక్కువగా మద్యం దుకాణాలు ప్రయత్నిస్తున్నాయి. దీంతో కొన్ని చోట్ల ప్రజలు తిరగబడుతున్నారు. మద్యం దుకాణాల వద్దనే మంచింగ్ కోసం ఫుడ్ స్టాల్స్ ను కూడా ఏర్పాటు చేసుకుని బహిరంగంగా మద్యాన్ని సేవిస్తున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. మద్యం దుకాణల్లోనే వాటర్ బాటిల్స్ తో పాటు సోడాలు కూడా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం వైన్ షాపుల వద్ద మద్యాన్ని సేవించకూడదు. పర్మిట్ రూంలకు ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన తర్వాతనే వాటిని నడుపుకోవాల్సి ఉంది. అయితే కొత్తగా ప్రారంభించిన మద్యం దుకాణాల్లో ఎక్కువ శాతం అంటే విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి వంటి నగరాల్లో మాత్రమే కాకుండా రూరల్ ఏరియాల్లోనూ పర్మిట్ రూంలను ఏర్పాటు చేసుకున్నారుమద్యం అక్కడే సేవిస్తూ అక్కడే కొందరు ఉంటున్నారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల ఘర్షణలు కూడా తలెత్తుతున్నాయి. సొంత వాహనాలను తీసుకు వచ్చి అక్కడే గంటల పాటు కూర్చుని మద్యం తాగుతుండటంతో ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. సిట్టింగ్ ల కోసం ప్రత్యేకంగా వైన్ షాపుల పక్కనే షెడ్లను ఏర్పాటు చేసుకున్నారు. అయినా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కోసం ప్రవేశపెట్టిన కొత్త పాలసీతో సర్కార్ కు ఏమో కాని వైన్ షాపుల యజమానులకు మాత్రం కాసుల పంట పండుతోంది. లక్షలు వెచ్చించి షాపులు దక్కించుకున్న వారు వెంటనే దానిని తిరిగి సంపాదించుకునే ప్రయత్నంలో అడ్డదారులు తొక్కుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ట్రాక్టర్లతో దిగుమతి....

# ట్రక్కుల్లో ఎగుమతి

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ నూతన మద్యం పాలసీ ఇసుకాసురులకు కాసుల వర్షం కురిపిస్తోంది. విధానంలోని లోపాలను అసరాగా చేసుకున్న అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. పేదలను అడ్డుపెట్టుకొని జేబులు నింపుకుంటున్నారు. వాగుల నుంచి ఇసుకను ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా గ్రామాల్లోకి తీసుకొచ్చి.. అక్కడి నుంచి టిప్పర్ల ద్వారా పట్టణాలు, నగరాలకు ఎగుమతి చేస్తున్నారు.కృష్ణా జిల్లాలో ఉన్న బుడమేరు అక్రమార్కులకు వరంగా మారింది. ఇటీవల వరదలు రావడంతో బుడమేరులో ఇసుక మేటలు గట్టిగా ఉన్నాయి. బుడమేరుకు అటు, అటు ఉన్న గ్రామాల్లోని కొందరు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను తీసుకొస్తున్నారు. గ్రామాల్లోని ఒకచోట దిగుమతి చేస్తున్నారు. ఇసుకాసురులు టిప్పర్లతో అక్కడ వాలిపోతున్నారు. టిప్పర్ల ద్వారా ఎగుమతి చేస్తున్నారు.మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలం చిన నందిగామ సమీపంలో నాణ్యమైన ఇసుక లభ్యమవుతోంది. అక్కడ కొంతమంది కుమ్మక్కై.. వాగులో ఇసుక తవ్వుతున్నారు. అక్కడినుంచి గణపవరానికి తరలిస్తున్నారు. గణపవరం గట్టు పక్కనున్న ప్రాంతంలో డింపింగ్ చేస్తున్నారు. ట్రాక్టర్లలో తీసుకొచ్చిన ఇసుకను.. గుట్టలు గుట్టలుగా పోశారు. దాదాపు కిలోమీటర్ మేర ఇసుకను నిల్వ చేశారు.ఇక సాయంత్రం అవ్వగానే అక్కడికి టిప్పర్లు వస్తున్నాయి. యంత్రాల సాయంతో.. అక్కడ నిల్వ చేసిన ఇసుకను టిప్పర్లలో లోడ్ చేస్తున్నారు. 20 టన్నుల టిప్పర్లలో ఇసుకను నింపి.. అక్కడి నుంచి విజయవాడ, ఏలూరు, నూజివీడు, ఆగిరిపల్లి తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్ ఇసుకకు రూ.20 వేలు వసూలు చేస్తున్నారు. అన్ని ఖర్చులు పోనూ.. ఒక్కో టిప్పర్‌కు రూ.10 వేల వరకు లాభాన్ని జేబులో వేసుకుంటున్నారు.ఈ దందాలో అధికార పార్టీ నాయకులు ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. స్వయంగా సీఎం చంద్రబాబు చెప్పినా.. ఇసుకాసురులు లెక్కచేయడం లేదు. ఇటు ఇసుక స్మగ్లింగ్‌ను అరికట్టాల్సిన అధికారులు ఏం చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. కేవలం ప్రజలు తమ అవసరాలకే ఇసుకను తెచ్చుకోవాలి. కానీ.. కొందరు గ్రామాల్లో డబ్బుల కోసం ఇలా ఇసుకను అమ్మేస్తున్నారు. ఇదే జీవనోపాధిగా ఎన్నో కుటుంబాలు ఇసుకపై ఆధారపడి జీవిస్తున్నాయి.

## తెలంగాణ ఎమ్మెల్యేల లేఖలను

# అనుమతించాలి

**తిరుమల** తిరుమలలో తెలంగాణ ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను అనుమతించకపోవడంతో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ , ఆంధ్ర నాకు రెండు కళ్ళు అన్న చంద్రబాబు నాయుడు, . ఇప్పుడు ఒక కన్ను పొడిచేసుకొన్నారా అని ప్రశ్నించారు. తెలంగాణ ఎమ్మెల్యేల లెటర్లను తిరుమలలో అనుమతించనప్పుడు, తెలంగాణలో మీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఫోన్ చేస్తే ప్రత్యేక దర్శనాలు ఎందుకు ఏర్పాటు చేయాలని నిలదీసారు. మా లెటర్లు అనుమతిస్తారా...?? లేక మేము అంతా కలిసి ఓ నిర్ణయం తీసుకోవాలా అని అన్నారు. కేవలం వ్యాపారం చేసుకోవడానికే మా ప్రాంతాన్ని వాడుకొంటారా అని మండిపడ్డారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. స్పాట్‌లో నలుగురు మృతి

**చిత్తూరు** కడప చిత్తూరు హైవేలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కలగడ సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో సీఎంఆర్ ట్రావెల్ బస్సు - ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులు స్పాట్లోనే మృతి చెందగా.. మరో ఇద్దరు ప్రయాణికుల పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, మృతుల యొక్క పూర్తి వివరాలపై ఆరా తీస్తున్నారు.

# శివారు గ్రామాల్లో తగ్గన మద్యం అమ్మకాలు

**విజయవాడ :** ఏపీలో కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవలె ప్రైవేట్ మద్యం షాపులు ఓపెన్ అయ్యాయి. కస్టమర్లకు నచ్చిన మద్యం విక్రయిస్తున్నారు. ఏపీలో నాణ్యమైన మద్యం దొరుకుతుండడంతో సరిహద్దు గ్రామాల్లోని తెలంగాణ వైన్ షాపుల్లో మద్యం విక్రయాలు తగ్గినట్లు తెలుస్తోంది.ఏపీలో మందుబాబులు... ఎన్నాళ్లో వేచిన ఉదయం, ఈనాడే ఎదురవుతుంటే అంటూ ఫుల్ ఖుషీ అవుతున్నారు. కళ్ల ముందు క్వాలిటీ మద్యం కనిపిస్తుంటే ఆ ఆనందం చెప్పలేనంత అంటున్నారు. అయితే ధరల విషయం మాత్రం మందుబాబులు కాస్త అసంతృప్తితో ఉన్నారు. క్వాలిటీ మద్యం అయితే దొరుకుతుంది కానీ ధరలు మాత్రం తగ్గలేదంటున్నారు. మరికొన్ని రోజుల్లో మద్యం ధరలు తగ్గుతాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఏపీలో ఇటీవల కొత్త మద్యం పాలసీ ప్రారంభం అయ్యింది. వైసీపీ హయాంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి, ప్రైవేట్ వారికి లాటరీ విధానంలో అందించింది కూటమి ప్రభుత్వం. ప్రైవేట్ మద్యం షాపుల నుంచి ప్రభుత్వానికి భారీగానే ఆదాయం వస్తుంది.రెండేళ్ల పాటు కొత్త మద్యం పాలసీ అమల్లో ఉంటుంది. ఇక మద్యం షాపులు దక్కించుకున్న వారికి సిండికేట్ల బాధ తప్పడంలేదు. ఎమ్మెల్యేలు, వారి అనుచరులకు వాటాలు ఇవ్వాలన్సి పరిస్థితులు ఉన్నాయని అంటున్నారు. మద్యం లాభసాటి వ్యాపారం కాబట్టి షాపులు దక్కించుకున్న వారు...వాటాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇన్నాళ్లు నాసిరకం మద్యం తాగలేక పక్క రాష్ట్రాల వైపు చూసేవాళ్లమని, ఇక ఏపీలోనే నాణ్యమైన మందు దొరుకుతుందంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎవరైనా తెలంగాణ నుంచి ఏపీకి వస్తుంటే...ఫలానా మద్యం తీసుకురా అని చెప్పేవారమని, ఇప్పుడు ఆ పరిస్థితి మారిందంటున్నారు. తెలంగాణ సరిహద్దు గ్రామాల వారు... బోర్డర్ దాటి వెళ్లి బ్రాండెడ్ మద్యం తాగివచ్చే వారు. దీంతో తెలంగాణలో బ్రాండెడ్ బ్రాండ్ల మద్యం అమ్మకాలు జోరుగా సాగేవి. గత వారం రోజులుగా తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో మద్యం అమ్మకాలు మునుపటి కంటే కాస్త తగ్గాయని వ్యాపారులు అంటున్నారు.ఏపీ సరిహద్దు గ్రామాల్లోని తెలంగాణ మద్యం షాపుల్లో నిత్యం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు అదనపు లిక్కర్ విక్రయాలు జరిగేవి. ఏపీలో కొత్త మద్యం పాలసీ అందుబాటులోకి రావడం, బ్రాండెడ్ మద్యం దొరుకుతుండడంతో బోర్డర్ సమీపంలోని తెలంగాణ మద్యం షాపుల్లో విక్రయాలు కాస్త తగ్గాయని సమాచారం. తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని సత్తుపల్లి, ఆశ్వారావుపేట, భద్రాచలం, మధిర, కోదాడ, హుజుర్‌నగర్, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాలలో మద్యం విక్రయాలు మందగించాని తెలుస్తోంది. కోదాడ, హుజుర్‌నగర్ నియోజకవర్గాల్లో సరిహద్దు ప్రాంతంలో 12 మద్యం దుకాణాలు ఉండగా... ఒక్కో షాపులో రోజుకు రూ1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఏపీ మందుబాబు బ్రాండెడ్ మద్యాన్ని విక్రయించేవారు. ఈ లెక్కన అన్ని షాపుల్లో రోజుకు రూ.24 లక్షలు, నెలకు రూ.7 కోట్ల పైగా ఏపీ మందుబాబులు మద్యం కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ఈ విక్రయాలు తగ్గాయని అక్కడి వ్యాపారులు అంటున్నారు.ఏపీ, తెలంగాణలో మద్యం ధరలు పోలిస్తే... ప్రస్తుతం ఏపీలోనే మద్యం ధరలు అధికంగా ఉన్నాయి. క్వార్టర్ లో రూ.10 నుంచి 20, ఫుల్ రూ.50 నుంచి రూ.100 ఏపీలో అధికంగా ఉన్నాయి. అయితే ఇన్నాళ్లు మద్యం నాణ్యత బాగోలేక, తెలంగాణ సరిహద్దు గ్రామాలకు వెళ్లి అక్కడ మద్యం కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ఏపీలో నాణ్యమైన మద్యం దొరుకుతుండడంతో... ఖర్చును లెక్కచేయడంలేదు మద్యం ప్రియులు.

ఇదిలా ఉంటే త్వరలోనే తెలంగాణ కూడా మద్యం ధరలు పెరిగే అవకాశం ఉందని వార్తలు వస్తున్నారు. క్వార్టర్ రూ.20, బీరుపై రూ.10 పెంచే యోచనలో తెలంగాణ ఎక్సైజ్ శాఖ ఉందని తెలుస్తోంది. ఏపీలో ఈనెల 26వ తేదీ తర్వాత మద్యం ధరల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# రైల్వే స్థలాలతో నయా రాజకీయం

**విజయవాడ :** విజయవాడలో దశాబ్దాలుగా సాగుతున్న రైల్వే స్థలాల ఆక్రమణలు అడ్డు అదుపు లేకుండా సాగుతున్నాయి. గత మూడు నాలుగు దశాబ్దాలుగా నగరంలో ఖాళీ స్థలం కనిపిస్తే జెండాలు పాతడం, కాలనీలకు కాలనీలు పుట్టుకొస్తున్నా అధికారులు చోద్యం చూశారు. నేడు దానికి మూల్యం చెల్లిస్తున్నారు.విజయవాడ నగరం నడిబొడ్డున ఖరీదైన రైల్వే స్థలాలు ఏళ్ల తరబడి కబ్జాలకు గురవుతున్నా రైల్వే అధికారులు చోద్యం చూస్తుండటంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. రైల్వే విస్తరణ, అభివృద్ధి పనులకు భూమి అవసరమైనా వినియోగించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి.చెన్నై-న్యూఢిల్లీ గ్రాండ్ ట్రంక్ మార్గంలో విజయవాడ పర్మనెంట్ వే డిపార్ట్‌మెంట్ సౌత్ సెక్షన్ పరిధిలో ఉన్న రైల్వే భూములు కొన్నేళ్లుగా ఆక్రమణలకు గురవుతూ వచ్చాయి. మొదట్లో సంచార జాతుల ప్రజలు రైల్వే ట్రాకుల వెంబడి గుడిసెలు వేసుకుని నివాసం ఉండటంతో రైల్వే అధికారులు వారిని చూసి చూడనట్టు వదిలేశారు90వ దశకం నుంచి వాటిలో ఆక్రమణలు మొదలయ్యాయి. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ పరిధిలో విజయవాడ-కొండపల్లి సెక్షన్ పరిధిలో డౌన్‌లైన్ వెంబడి 90లలో సంచార ప్రజలు గుడిసలు ఉండేవి. మిగిలిన భూములన్నీ ఖాళీగా ఉండేవి. ఆ తర్వాత కాలంలో ప్రజా ప్రతినిధులు రైల్వే స్థలాలను ప్లాట్లుగా వేసి విక్రయించడం మొదలైంది.దీనికి ప్రధానంగా కొన్ని రాజకీయ పార్టీలు అండగా నిలిచాయి. మొదట జెండాలు పాతడం, రైల్వే అధికారులు పట్టించుకోకపోతే వాటిలో ఇళ్ల నిర్మాణం చేపట్టడం జరిగేది. గత 25-30ఏళ్లలో దశల వారీగా ఎన్నికైన ప్రతి కార్పొరేటర్ రైల్వే స్థలాలను కబ్జా చేయడంలో కీలక పాత్ర పోషించారు. అయా ప్రాంతాలకు తమ ఏకంగా తమ పేర్లను కూడా పెట్టేశారు.చెన్నై-న్యూ ఢిల్లీ గ్రాండ్ ట్రంక్ మార్గంలో కాజీ పేట నుంచి విజయవాడ వరకు ప్రస్తుతం ఉన్న రైల్వే ట్రాకులు రద్దీని ఏమాత్రం తట్టుకోలేకపోతున్నాయి. విజయవాడ రైల్వే స్టేషన్‌కు నిత్యం 250కు పైగా ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వస్తుంటాయి. ఉత్తర దక్షిణ భారత దేశాల వెళ్లే ప్రతిరైలు విజయవాడ జంక్షన్‌కు రావాలంటే ఉన్న మూడు లైన్లు సరిపోవడం లేదు. వీటితో పాటు మరో 70కు పైగా గూడ్స్ రైళ్లను కూడా విజయవాడ మీదుగా అనుమతించాలి. దాదాపు 325 రైళ్లను 24 గంటల్లో నియంత్రించడం రైల్వే శాఖపై ఒత్తిడిగా ఉంటోంది. ఔటర్లలో రైళ్లు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. విజయవాడలో 10 ప్లాట్‌ఫామ్‌లు ఉన్నా రైళ్ల రాకపోకలు సమయానికి నిర్వహించలేకపోతున్నారు. ఆధునిక పరిజ్ఞానంతో రైళ్లను నియంత్రిస్తున్నా ఒకదాని తర్వాత మరొకటి క్యూ కడుతుండటంతో మరిన్ని రైల్వే ట్రాకుల్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది.విజయవాడ రైల్వే స్టేషన్‌కు ఒకటిన్నర కిలోమీటర్ దూరంలో ఉన్న భూమి ఆక్రమణలకు గురి కావడంతో రైళ్లను నిలపడం, కొత్త రైల్వే ట్రాకుల్ని నిర్మించడం కష్టంగా మారింది. రైల్వే భూముల్ని యథేచ్ఛగా కబ్జా చేయడంలో రాజకీయ పార్టీలు కీలకంగా వ్యవహరించాయి. విజయవాడ-కాజీపేట, విజయవాడ -విశాఖపట్నం మార్గాల్లో భారీ ఎత్తున రైల్వే భూములు అన్యాక్రాంతం అయ్యాయి.వాటిలో శాశ్వత నివాసాలు వెలిశాయి. ఇన్నేళ్లుగా వాటిని అడ్డుకోవడంలో రైల్వే అధికారులు పూర్తిగా మొద్దు నిద్రపోయారు. కొన్ని చోట్ల ప్రార్థనామందిరాలు కూడా ఏర్పాటు చేశారు. అవి రైల్వే స్థలాలని తెలిసినా భవిష్యత్తులో ఆక్రమణలు తొలగించకుండా వ్యూహాత్మకంగా ఇలా నిర్మాణాలు చేపట్టారనే ఆరోపణలు ఉన్నాయి.రైల్వే అధికారులు చేపట్టన విస్తరణ పనుల్ని రాజకీయ నేతలు అడ్డుకుంటున్నారు. విజయవాడ రైల్వే జంక్షన్ అభివృద్ధిలో భాగంగా కాజీపేట-విజయవాడ సెక్షన్ పరిధిలో ఆక్రమణల్ని తొలిగిస్తామని రైల్వే అధికారులు ప్రకటించారు. పక్షం రోజుల్లో ఆక్రమణలు తొలగించాలని స్పష్టం చేశారు. దీంతో రైల్వే స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలంటూ కొత్త ఆందోళన ప్రారంభమైంది.

వీటికి అన్ని పార్టీలు మద్దతిస్తున్నాయి. రైల్వే స్థలాల్లో ఆక్రమణలకు విద్యుత్, తాగునీరు, రోడ్ల నిర్మాణం వంటి పనులకు స్థానిక నేతలు గతంలో డబ్బులు వసూలు చేశారు. కార్పొరేషన్ డబ్బులతో సదుపాయాలు కల్పించి ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్ము తమ ఖాతాల్లో వేసుకున్నారు. రైల్వే అధికారుల హెచ్చరికలతో ఆందోళనలు మొదలు పెట్టారు. రైల్వే భూముల్లో గతంలో మార్కింగ్ చేసి బోర్డులు ఏర్పాటు చేసినా వాటిని గుట్టు చప్పుడు కాకుండా తొలగించి ఫ్లాట్లుగా అమ్మేశారు.తెలిసి కొందరు, తెలియక కొందరు రైల్వే స్థలాల్లో భారీ భవనాలు నిర్మించేశారు. తమకు అవసరం వచ్చినపుడు చూద్దామనుకుని రైల్వే అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. ఇప్పుడు వాటిని తొలగించాల్సిందేనని రైల్వేశాఖ స్పష్టం చేయడంతో లబోదిబోమంటున్నారు.

# ఒక్కొక్కరు 16 మంది పిల్లలను కనండి

ప్లీజ్.. పెళ్లి చేసుకోండి, పిల్లల్ని కనండి, అవసరమైతే లీవ్స్ పెట్టండని అంటోంది. ఎందుకని ఈ మార్పు... మొన్న జపాన్, నిన్న చైనా... ఇప్పుడు భారత్... కొత్త స్లోగన్ అందుకుంటున్నాయి..యువత తగ్గిపోతున్న కారణంగా చైనా జీడీపీ కూడా తగ్గుతోంది కాబట్టి. ఇక జపాన్. అమెరికా తరువాత అత్యంత శక్తివంతమైన దేశం. ఎకానమిలో అమెరికా తరువాత జపానే. కాని, చేజేతులా ఆ ప్లేస్‌ను చైనాకు ఇచ్చేసింది. 2010 తరువాత ఆ సెకండ్ ప్లేస్‌ను చైనా లాగేసుకుంది. కారణం.. జపాన్‌లో పిల్లల సంఖ్య తగ్గడం. యువత తగ్గిపోయి వృద్ధుల సంఖ్య పెరిగినందుకు.. జపాన్ ఆర్థిక వ్యవస్థ కుంచించుకుపోయింది. ఇక ఇండియా. అతి త్వరలోనే జర్మనీని క్రాస్ చేసి జపాన్ ప్లేస్‌లోకి వెళ్లబోతోంది. మూడునాలుగేళ్లలో టాప్-3 ఎకానమీగా ఇండియా ఉండబోతోంది ఇండియా. కారణం.. యూత్ ఎక్కువగా ఉండడం. యువత లేని దేశాలు ఆర్థికపరంగా ఎలా కిందకు పడిపోతున్నాయో స్వయంగా చూస్తున్నాం. అదే యువత ఉన్న కారణంగా ఆర్థికంగా ఇండియా ఎలా ఎదుగుతోందో కూడా చూస్తున్నాం. యూత్ లేకపోతే దేశాలు అభివృద్ధి చెందడం లేదా, చైనా-జపాన్ టాప్ పొజిషన్‌లో లేవా అని. ఇప్పటికైతే.. ధనిక దేశాల జాబితాలో చైనా, జపాన్ సెకండ్ అండ్ థర్డ్ పొజిషన్‌లో ఉన్నాయి. కాని, చైనా, జపాన్ ఆర్థికవ్యవస్థల స్పీడ్ మెల్లమెల్లగా తగ్గుతూ వస్తోంది. కారణం.. యూత్ లేకపోవడమే. ఎప్పుడైనా సరే.. కొత్త టెక్నాలజీని అడాప్ట్ చేసుకునేదే యూత్. కొత్త టెక్నాలజీతో వచ్చే వస్తువులను కొనేదే యువత. వాళ్లే లేటెస్ట్ టెక్నాలజీ వెంట పడకపోతే.. ఇక వాటిని తయారు చేయాల్సిన అవసరం ఏంటి? అదే జరిగితే.. కొత్తగా కనిపెట్టడం కూడా అనవసరమే కదా. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, లేటెస్ట్ ఇన్నోవేషన్స్ అన్నీ దండగేగా. అందులోనూ యూత్‌లో రిస్క్ తీసుకునే కల్చర్ ఎక్కువగా ఉంటుంది. స్టార్టప్ కావొచ్చు, మరేదైనా బిజినెస్ కావొచ్చు.. రిస్క్ తీసుకుని ముందుకు వెళ్తేనే ప్రాఫిట్స్ వస్తాయి. అమ్మో రిస్క్ ఎందుకు అని భయపడితే.. అలాగే ఉండిపోతారు. సో, యూత్ లేని దగ్గర ఈ రిస్క్ కల్చర్ తగ్గిపోతుంది. అదే జరిగితే.. ఎకానమీపై ఎఫెక్ట్ చూపిస్తుంది.ఈ ప్రపంచంలో రెండు రకాల ఆర్థిక వ్యవస్థలు ఉన్నాయి. ఒకటి సేవింగ్ ఎకానమీ, రెండోది స్పెండింగ్ ఎకానమీ. నిన్న మొన్నటి వరకు ఇండియాది సేవింగ్ ఎకానమి. వచ్చిన దాన్లో ఎంతో కొంత దాచుకోవడమే చూశాం. ఇప్పుడు భవిష్యత్‌పై భయం పోయింది. ఎప్పుడేం జరుగుతుందోనన్న భయం లేదిప్పుడు. సో, దాచుకోవడం తగ్గించి కాస్త ఎక్కువ ఖర్చు చేయడం మొదలుపెడుతున్నాం. అమెరికాది ప్యూర్‌గా స్పెండింగ్ ఎకానమి. అక్కడ ఐదు రోజుల పాటు సంపాదించిన డబ్బుని వీకెండ్‌లోని రెండు రోజుల్లో ఖర్చు పెట్టేస్తారు. కారణం.. సోమవారం నుంచి మళ్లీ చేతిలో డబ్బులు పడతాయనే భరోసా. అమెరికా సహా యూరప్ దేశాలది స్పెండింగ్ ఎకానమిస్ కాబట్టే.. రెండు ప్రపంచ యుద్ధాలను ఫేస్ చేసిన తరువాత కూడా అంతే ఫాస్ట్‌గా డెవలప్ అయ్యాయి. అమెరికాను పక్కన పెడితే యూరప్ దేశాలు, జపాన్ ఇప్పటికీ స్పెండింగ్ ఎకానమిసే. కాకపోతే.. అక్కడ కొనే యూత్ లేరు. వృద్ధుల సంఖ్య పెరిగిపోవడంతో.. ఉన్న దాంతోనే సంతృప్తిపడడం ఎక్కువైపోయింది. సో, ఖర్చు పెట్టడం తగ్గిపోయింది. ఎక్కడైతే ఖర్చుపెట్టడం తగ్గుతుందో, ప్రాడక్ట్స్ సేల్స్ తగ్గుతాయో.. ఇక ఆ దేశ ఆర్థిక వ్యవస్థ కుచించుకుపోతున్నట్టే అర్థం. ప్రస్తుతం జపాన్‌లో ఆ పిరియడే నడుస్తోంది. చైనాలో త్వరలో అలాంటి సిచ్యుయేషన్ రాబోతోంది.ఇక ఫిన్లాండ్. ప్రపంచంలోనే ప్రజలు అత్యంత సంతోషంగా ఉన్న దేశాల్లో టాప్‌లో ఉంటుందది. నేరాలు లేని దేశం కూడా. ఎంత సంతోషమయమైన దేశం అయితే మాత్రం ఏం లాభం..! యూత్ లేరక్కడ. యునైటెడ్ నేషన్స్ ప్రకారం 2030 నాటికి ఫిన్లాండ్ దేశంలోని 47 శాతం మందికి పైగా ప్రజలు 65 సంవత్సరాలు దాటుతారు. అంటే.. దేశంలో సగానికి సగం వృద్ధులే. ప్రపంచ మొత్తం మీద జపాన్ తర్వాత 65 సంవత్సరాలు దాటిన వారు ఎక్కువగా ఉన్న దేశం ఫిన్లాండ్. ఇక కొరియా కూడా టెక్నాలజీలో అప్‌గ్రేడెడ్ కంట్రీనే. అక్కడ కూడా యూత్ తగ్గిపోతోంది. యూత్ తగ్గుతోంది అనడం కంటే.. అసలు పిల్లల్ని పెద్దగా కనడమే లేదు అని చెప్పుకోవాలేమో.

ముగ్గురు చనిపోతుంటే ఒకరు పుడుతున్నారు. కొరియాతో పాటు జపాన్, చైనాలోనూ పెళ్లి, పిల్లలపై ఇంట్రస్టే కనిపించడం లేదు అక్కడి యువతకి. ఏమంటే.. సోలో బ్రతుకే సో బెటర్ అంటున్నారు. పెళ్లి చేసుకుంటే.. ఫ్యామిలీ బర్డెన్ మోయాలి, వాళ్ల కోసం కష్టపడాలి, ఇంకాస్త ఎక్కువ సంపాదించాలి అనే మెంటల్ స్ట్రెస్‌లో ఉన్నారు. సో, సింగిల్‌గా ఉన్నంత ఉత్తమం లేదనుకుంటున్నారు. అక్కడి ఆడవాళ్లు కూడా అదే మైండ్‌సెట్‌తో ఉన్నారు. పిల్లల్ని కనాలి, ఫ్యామిలీని చూసుకోవాలి, బండెడు చాకిరీ చేయాలి. అదే పెళ్లి చేసుకోకపోతే.. లైఫ్ అంతా సింగిల్‌గా ఉంటూనే ఎంజాయ్ చేయొచ్చు అని ఫీలవుతున్నారు. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే.. చైనా, జపాన్‌లో ఇప్పుడు కనిపిస్తున్న డెవలప్‌మెంట్ అంతా ఆగిపోతుంది. అభివృద్ధి తగ్గిపోతుంది కూడా. ఎందుకంటే.. టెక్నాలజీపైనా, రీసెర్చ్‌పైనా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పైనా పెట్టాల్సిన ఇన్వెస్ట్‌మెంట్‌ని.. భవిష్యత్తులో హాస్పిటల్స్ కోసం, ఓల్డ్ ఏజ్ హోమ్స్ కోసం, వారికి ఇవ్వాల్సిన పెన్షన్స్ కోసం, హెల్త్‌కేర్ సిస్టమ్ కోసం పెట్టాల్సి వస్తుంది. ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో ఇదే స్లోగన్ వస్తోంది.. నిన్న చంద్రబాబు.. ఇవాళ స్టాలిన్ పిల్లలను కనండి అంటూ కామెంట్స్ చేసేస్తున్నారు.దక్షిణ భారతదేశంలో మధ్య వయసు వాళ్లే ఎక్కువగా కనిపిస్తున్నారిప్పుడు. 2047 నాటికి.. వీళ్లంతా వృద్ధుల జాబితాలోకి వెళ్తారు. సంతానోత్పత్తి రేటులో జాతీయ సగటు 2.1 ఉంటే.. సౌత్ ఇండియాలో సంతానోత్పత్తి రేటు 1.6కి పడిపోయింది. అంటే.. ఏపీతో సహా దక్షిణాదిన వృద్ధాప్య సమస్య సంకేతాలు కనిపించడం మొదలైందన్నమాట. ప్రస్తుతం ఇండియాలో యూత్ ఎక్కువగా ఉన్నారు కాబట్టి ఇప్పటికిప్పుడు వచ్చిన సమస్యేం లేదు. మన దగ్గరున్న యూత్ సగటు వయసు 29 సంవత్సరాలు. ప్రపంచంలో మరే దేశంలో లేని యూత్ ఇండియాలోనే ఉన్నారు. 2047 వరకు జనాభాపరంగా, యూత్ పరంగా మనకొచ్చిన ఇబ్బందేం లేదు. మరో పాతికేళ్ల వరకు ఇప్పుడున్న యువతే దేశాన్ని నడిపిస్తుంది. మరి ఆ తరువాత..? ఇప్పుడు యావరేజ్‌గా 29 ఏళ్లున్న వాళ్లు పాతికేళ్ల తరువాత రిటైర్మెంట్‌కు దగ్గరపడతారు.

సో, 2047 తరువాత వృద్ధ భారతం తయారవొచ్చు. అలా కాకుండా ఉండాలంటే.. ఇదిగో ఇప్పటి నుంచే ఒక కుటుంబం ముగ్గురు నలుగురిని కనాలని చెబుతున్నారు. ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉంటే.. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయకూడదనే చట్టం ఉంది. ఇప్పుడు సీఎం చంద్రబాబు ఏమంటున్నారో తెలుసా. ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉన్నవారు మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులుగా చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉంది అని.ఒకప్పుడు జనాభా నియంత్రణను పాటించి, విజయవంతంగా పూర్తి చేసింది దక్షిణాది రాష్ట్రాలే. అదే.. ఆనాడు చేసిన తప్పు అని ఇప్పుడు ఫీల్ అవుతున్నాయి. చదువుకున్న వాళ్లు ఎవరైనా.. ఒకరు లేదా ఇద్దరు అనే అనుకుంటారు. కేరళ.. అక్షరాస్యతలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన రాష్ట్రం. అందుకే, కేరళ కూడా అదే పని చేసింది.

# బ్యాలెట్ తోనే దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది

## - మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్

**హైదరాబాద్** బ్యాలెట్ పేపర్ తో ఎన్నికల నిర్వహించడం ద్వారానే దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో దూసుకుపోతున్న అమెరికా వంటి అగ్ర రాజ్యాలు సైతం వారి ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుతెరగాలని అన్నారు. దేశంలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియ తీవ్ర ఆందోళన గురిచేస్తుందని అన్నారు. ఇటీవల జరిగిన హర్యానా ఎన్నికలతో పాటు దేశంలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న ఎన్నికలపై ప్రజలకు అనుమానాలు ఉన్నాయని అన్నారు. మూసి ప్రక్షాళన పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మంచిదేనని మేధావులు, ఆయా రంగాల నిపుణులతో విస్తృతంగా చర్చించి ముందుకు వెళితే బాగుంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుండగా ఆంధ్రప్రదేశ్ పరిస్థితి నానాటికి దిగజారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉందని చెప్పుకునే చంద్రబాబు తిరుపతి లడ్డు విషయంలో తప్పుగా మాట్లాడి ఆయన ఇమేజ్ ను తగ్గించుకున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో దేశంలో తీవ్ర అలజడి నెలకొనే ప్రమాదం ఉందని అన్నారు. పాలకులు ప్రజలకు మెరుగైన పాలన అందించే అంశంపై దృష్టి సాధించాలని సూచించారు. దేశంలో పెరుగుతున్న ధరల్లోను తగ్గించి పేదలకు ఆహార ధాన్యాలు తక్కువ ధరలకు అందెల చూడాలని కోరార.

# రంగస్థలం తరవాత అంతటి సినిమా

## – పొట్టేల్ మేవీపై దర్శకుడు సందీప్ వంగా




రంగస్థలం చిత్రం తరవాత అంత మంచి కథతో వస్తున్న చిత్రం పొట్టేల్ అని ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా అన్నారు. యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో సాహిత్ మోత్కూరి రూపొందించిన సినిమా 'పొట్టేల్' ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను సోమవారం నిర్వహించారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్న కథను తెరకెక్కిస్తున్నానంటూ సాహిత్ ఓ రోజు నాకు చెప్పాడు. అది వినగానే 'ఇది చిన్న కథ కాదు పెద్దది' అని అనిపించింది. సినిమా చూశా. నాకు నచ్చింది. ఇలా ఉంటుందని నేను ఊహించలేదు. అందరూ చక్కగా నటించారు. మీకూ నచ్చుతుందని భావిస్తున్నా. ఇటీవల యంగ్ డైరెక్టర్లు ఎవరూ ఇలా పూర్తిస్థాయి గ్రామీణ నేపథ్యంతో సినిమా చేయలేదనుకుంటున్నా. ఆ బ్యాక్‌డ్రాప్‌లో 'రంగస్థలం' తర్వాత నేను చూసిన సినిమా ఇదే. చిన్న సినిమాని ప్రోత్సహించండి అని సందీప్ రెడ్డి ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు.ఇందులో నటించిన వారంతా గర్వపడే చిత్రమిది. మేమంతా కెరీర్ బెస్ట్ పెర్ఫామెన్స్ ఇచ్చాం. గొప్ప సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో నటించినందుకు నాకంటే ఎక్కువగా మా అమ్మ గర్వంగా ఫీలవుతారు. హీరోయిన్లు మేకప్ వేసుకుని.. ఎప్పుడూ నవ్వుతూనే ఉంటున్నంత మాత్రాన వారికి హృదయం ఉండదు, ఫ్యామిలీ ఉండదని కాదు. మమ్మల్నీ గౌరవించండి అని నటి అనన్య నాగళ్ల పేర్కొన్నారు. తన కుమార్తెను చదివించాలనుకునే ఒక గొర్రెల కాపరి కథ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబర్ 25న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ముఖ్యఅతిథిగా హాజరయ్యాడు. ఈ సందర్భంగా సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. ఫస్ట్ కథ విన్నా.. ఓ చిన్న కథ చేసుకున్నానని చెప్పిండు. కథ విన్న తర్వాత తెలిసింది చిన్న కథ కాదు.. పెద్దది.. సినిమా చూశాచాలా బాగా నచ్చింది. రెండు పాటలు చాలా బాగా నచ్చాయి. ట్రైలర్ కూడా బాగుంది. అజయ్ మాత్రం భయపెట్టించి వదిలి పెట్టారు. నేను సినిమా చూసిన అని చెప్పట్లేదు. ఇంత బాగా చేస్తారని నేను ఊహించలేదు. ఎందుకంటే చిన్న సినిమా అన్నడు.. నాకు పెద్ద బ్జడెట్ కనిపించింది. ఎట్ల తీస్తడో అనుకున్న. అతన్ని నమ్మిన నిర్మాత సేఫ్ అని.. పెద్ద మనసుతో చేసిన చూసిన సినిమా ఇది. చూసిన అని డబ్బా కొట్టడం కాదు.. అందరికీ బాగా నచ్చుతుంది. ఇప్పుడున్న యువ దర్శకుల్లో ఇలా గ్రామానికి వెళ్లి సినిమా తీయడం ఈ మధ్య కాలంలో నేను చూడలేదు. అక్టోబర్ 25న మీ ముందుకొస్తుంది.. అందరూ చిన్న సినిమాను ప్రోత్సహించండని విజ్ఞప్తి చేశాడు. ఈ మూవీలో అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరీ, నీల్ సీన్, చత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్, జీవన్, రియాజ్, విక్రమ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎన్ఐఎస్ఏ ఎంటర్‌టైనర్‌మెంట్ బ్యానర్‌పై నిశాంక్ రెడ్డి కుడితి, ప్రగ్యా సన్నిది క్రియేషన్స్ బ్యానర్‌పై సురేష్ కుమార్ సడిగే సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# 31న వస్తున్న కిరణ్ అబ్బవరం క... మూవీ



కిరణ్ అబ్బవరం కాంపౌండ్ నుంచి వస్తోన్న తొలి పాన్ ఇండియా ప్రాజెక్ట్ క . సుజిత్-సందీప్ డైరెక్ట్ చేస్తున్నారు. 1970స్ ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణగిరి గ్రామం బ్యాక్ డ్రాప్‌లో సాగే పీరియాడిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం అక్టోబర్ 31న దీపావళి కానుకగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్ లాంచ్ చేయనున్నారు మేకర్స్. మిస్టరీ, థ్రిల్లింగ్, సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో క ప్రపంచంలో మిమ్మల్ని ముంచెత్తడానికి అంతా సిద్ధంగా ఉంది.. అంటూ ట్రైలర్‌ను అక్టోబర్ 24న లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు. డార్క్ షేడ్స్‌లో ఎండిన చెట్ల మధ్యలో అనుమానాస్పద ఆకారం.. దానిపై గొడ్డలి లాంటి ఆయుధం నీడ కనిపిస్తున్న విజువల్స్ ట్రైలర్‌తోపాటు సినిమాపై సూపర్ క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. టైం ట్రావెల్ స్టోరీ చుట్టూ తిరిగే క చిత్రం నుంచి విడుదలైన రషెస్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రంలో 2018 ఫేం తాన్వి రామ్, గం గం గణెళిశా ఫేం నయన్ సారిక ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్యా?మ్ సీఎస్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# పొట్టేల్ ప్రమోషన్లలో అనన్య నాగళ్ల

## – ఓ మంచి చిత్రం ..ఆదరించడని వినతి





అనన్య నాగళ్ల ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'పొట్టేల్' అక్టోబర్ 25న విడుదల కానున్న నేపథ్యంలో వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు. కమిట్‌మెంట్‌ను ఎదుర్కొన్నారా?అన్న సామాజిక మాధ్యమాల వేదికగానూ తీవ్ర చర్చకు దారి తీసింది. తాజాగా ఈ అంశంపై అనన్య మాట్లాడారు. ఇంత డైరెక్ట్‌గా వేదికపై ఉన్న నటిని సున్నితమైన అంశంపై ఎలా ప్రశ్నించారని ఇంటికి వెళ్లాక కూడా ఆలోచించాను. అప్పుడు నాకు ఒక్కటే అనిపించింది. 'సంస్కారం అనేది ఉంటే ఇలాంటి ప్రశ్నలు వేయరు కదా' అనుకున్నా. నటిగా గుర్తింపు తెచ్చుకోవాలనేది నా కల. 5 సంవత్సరాల నుంచి దీని కోసం నేను ఇంట్లో ఫైట్ చేస్తున్నా. 'ఇండస్ట్రీలోకి వెళ్లి కుటుంబం పరువు తీసేసింది' అని కొందరు ఆలోచిస్తుంటారు. కానీ, 'పొట్టేల్' చూసిన తర్వాత మా ఇంట్లో వాళ్లందరూ గర్వంగా




ఫీలవుతారనుకున్నా. 'ఇంత గొప్ప సినిమాలో మా అమ్మాయి నటించింద'ని మా అమ్మ అందరితో చెబుతారని చాలా ఆనందించాను. అలాంటప్పుడు ఈ ప్రశ్న వేసి ఆనందం లేకుండా చేశారు. ఇప్పుడు నేను సక్సెస్ అయినా.. కమిట్‌మెంట్‌కు అంగీకరించాను కాబట్టి సక్సెస్ అయ్యానని అందరూ అనుకుంటారు. ఇప్పుడు మళ్లీ బంధువులందరూ ఇదే విషయం మా అమ్మను అడుగుతారు. హీరోయిన్లు మేకప్ వేసుకుని.. ఎప్పుడూ నవ్వుతూనే ఉంటున్నంత మాత్రాన వారికి హృదయం ఉండదు, ఫ్యామిలీ ఉండదని కాదు. మమ్మల్నీ గౌరవించండని పేర్కొన్నారు.

# లక్కీ భాస్కర్‌గా వస్తున్న దుల్కర్ సల్మాన్




దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వెంకీ అట్లూరి తెరకెక్కించిన చిత్రం 'లక్కీభాస్కర్'. అక్టోబర్ 31న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దుల్కర్ వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తన అనారోగ్యం వల్ల 'లక్కీభాస్కర్' షూట్‌లో జాప్యమైందన్నారు. సినిమాల మధ్య గ్యాప్ ఎక్కువ తీసుకోవడం నాకు నచ్చదు. ఈ ఏడాది మరో రెండు సినిమాలు రిలీజ్ కావాల్సి ఉంది. కానీ, కొన్ని కారణాల వల్ల ఒక సినిమా క్యాన్సిల్ అయింది. మరొకటి చివరి నిమిషంలో వర్కవుట్ కాలేదు. నా అనారోగ్యం కారణంగా 'లక్కీభాస్కర్' షూటింగ్ కూడా ఆలస్యమైంది. ఈ టీమ్ అంతా నాకు ఎంతో సపోర్ట్ చేసింది. దర్శకనిర్మాతల దగ్గర నుంచి లైట్‌మెన్ వరకు అందరూ నన్ను జాగ్రత్తగా చూసుకున్నారు. 'షూటింగ్ ఆపేద్దాం.. ఇంటికి వెళ్లండి' అని చెప్పేవారు. కానీ, అంత పెద్ద భారీ సెట్ వేసి చిత్రీకరణ చేస్తున్నప్పుడు నా కోసం అది ఆగిపోకూడదు కదా.. అందుకే ఎంత నొప్పిగా ఉన్నా షూటింగ్‌లో పాల్గొన్నా' అని దుల్కర్ చెప్పారు. ఈ విషయంపై వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. 'సాధారణంగా నటీనటులు 10 గంటలు పని చేయగలరు. కానీ, దుల్కర్ ఒక్కోరోజు 15 గంటల దాకా వర్క్ చేశారు. ఆయన బాధ చూసి మేము ఇబ్బంది పెడుతున్నామేమో అనిపించింది. షూటింగ్ కంటే ఆరోగ్యం ముఖ్యమని ఎన్నోసార్లు చెప్పాం. అయినా వినలేదు. సినిమాపై దుల్కర్‌కు ఉన్న అంకితభావం అలాంటిది. మేమంతా ఒకే కుటుంబంలా ఉంటాం' అని వివరించారు. 'లక్కీభాస్కర్' విషయానికొస్తే.. వెంకీ అట్లూరి దర్శకత్వంలో డ్రామా థ్రిల్లర్‌గా ఇది రూపొందింది. దుల్కర్ టైటిల్ రోల్‌లో కనిపించనుండగా.. మీనాక్షి చౌదరి , అయేషా ఖాన్ కీలకపాత్రల్లో నటించారు. దీపావళి కానుకగా అక్టోబర్ 31న ఈ చిత్రం విడుదల కానుంది. దీని గురించి నిర్మాత మాట్లాడుతూ.. బ్యాంకింగ్ నేపథ్యంలో కుటుంబ భావోద్వేగాలతో నడిచే ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందన్నారు. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది.



# సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పోలీసు శాఖ కృషి చేస్తుంది

- భద్రత ప్రమాద భీమా చెక్కు అందజేసిన జిల్లా ఎస్.పి శ్రీ. డి.ఉదయ్ కుమార్ రెడ్డి



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** మెదక్ జిల్లా అర్మ్డ్ రిజర్వ్ నందు పని చేస్తున్న కానిస్టేబుల్ శ్రీ.జైపాల్ ఆకాలంగా మరణించడం జరిగినది. ఇతని కుటుంబ సభ్యులకు పోలీసు భద్రత స్కీమ్ ద్వారా 8 లక్షల రూపాయల చెక్కును ఈ రోజు జిల్లా ఎస్.పి శ్రీ. డి.ఉదయ్ కుమార్ రెడ్డి జిల్లా పోలీసు కార్యాలయం నందు అందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పోలీసు శాఖ కృషి చేస్తుంది. భద్రత పథకం సిబ్బంది కుటుంబాలకు బాసటగా ఉన్నదని అన్నారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపినారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ శ్రీ. ఎస్.మహేందర్ , సూపరింటెండెంట్ శ్రీమతి మని , అనురాధ ,అదనపు ఎస్పీ సీసీ శ్రీ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ బారిన పాడిన విద్యార్థులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) హవెలిఘనపూర్ ఘనపూర్ మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ జ్యోతి పూలె గురుకుల పాఠశాలలో మంగళవారం ఉదయం విద్యార్థులకు విద్యుత్ షాక్ తగిలిన విషయం నాయకుల ద్వారా తెలుసుకున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి మెదక్ పట్టణంలోని పల్స్ హాస్పిటల్ కు చేరుకొని విద్యుత్ షాక్ కు గురైఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నలుగురు విద్యార్థులను పరామర్శించారు.ప్రమాదం ఎలా జరిగిందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు రజిత, వసంత, అనుష్క, గాయత్రి లు మాట్లాడుతూ పాఠశాలలో సార్ ఇనుప రాడ్ పాతుతుండగా సారుకు హెల్ప్ చేద్దామని మేము వెళ్ళాము కానీ ప్రమాదవశాస్తూ ఇనుప రాడ్ విద్యుత్ తీగలకు తాకి షాక్ వచ్చి చేతులకు గాయాలైనట్లు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ భానుచందర్ తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అదేవిధంగా పాఠశాల ప్రిన్సిపాల్ తో మాట్లాడుతూ ఏదైనా వర్క్ ఉంటే పాఠశాలలో వర్కర్లను పెట్టి చేయించాలని సూచించారు. పిల్లలతో పని చేయించవద్దని హెచ్చరించారు. వీరి వెంట మెదక్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి,తాజా మాజీ జడ్పీ ఉపాధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి, మెదక్ హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు యం. అంజ గౌడ్,సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మోహన్, శ్రీనివాస్, రంజిత్ లు పాల్గొన్నారు.

## నవంబర్ 4 నుంచి టాస్క్ సెంటర్ లో మొదటి బ్యాచ్.

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.



**మంథని ( ప్రశ్న న్యూస్)** 2022, 2023,2024 బ్యాచ్ డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు పేరు నమోదు చేసుకోవాలి అక్టోబర్ 30 లోపు ఆసక్తిగల అభ్యర్థులు శిక్షణ కోసం తమ పేరు నమోదు చేసుకోవాలి జిల్లాలో ఏర్పాటు చేసిన టాస్క్ కేంద్రంలో మొదటి బ్యాచ్ శిక్షణ తరగతులు నవంబర్ 4 తారీఖు నుంచి ప్రారంభమవుతాయని, ఆసక్తిగల యువతీ యువకులు తమ పేర్లను అక్టోబర్ 30 లోపు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టాస్క్ అనేది పరిశ్రమకు నాణ్యమైన మానవ వనరులు, సేవలను అందించే లక్ష్యంతో పరిశ్రమలకు %aa% అకాడెమియా మధ్య సమన్వయాన్ని తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన లాభాపేక్ష లేని సంస్థ అని, టాస్క్ పెద్దపల్లి రీజినల్ సెంటర్లో నవంబర్ 4 నుండి మొదటి బ్యాచ్ 2022,2023,2024 సంవత్సరంలో డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం పేరు నమోదు చేసుకోవాలని అన్నారు.టాస్క్ ద్వారా కనీసం 10 రోజుల సాఫ్ట్ స్కిల్స్ , ఇంటర్వ్యూ స్కిల్స్, ఐటీ స్కిల్స్ పై శిక్షణ అందించడం జరుగుతుందని, ఈశిక్షణలో మీ పేరు నమోదు చేసుకోవాలంటే టాస్క్ కార్యాలయాన్ని (పాత. ఎంపీ. డీ .వో భవనం) సందర్శించి ఇంచార్జి నిశాంత్ ను కలిసి వివరాలు తెలపాలని, అక్టోబర్ 30 లోపు పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.విద్యార్థుల నైపుణ్యానికి తగ్గట్టుగా వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతున్నది , ఇట్టి శిక్షణలో ఇంగ్లీషు, ఇతర టెక్నికల్ స్కిల్స్ పెంచేందుకు దోహదపడుతాయని , శిక్షణ తరువాత ప్లేస్ మెంట్ డ్రైవ్ చేయడం జరుగుతుందని,ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని, మరిన్ని వివరాలకు 9533308928 నందు సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి.

### తాసిల్దార్‌కు డిజెఎఫ్ జిల్లా కమిటీ వినతి పత్రం



**మంథని( ప్రశ్న న్యూస్)** వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఆక్రిడేషన్ తో సంబంధం లేకుండా ఇండ్ల స్థలాలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కమిటీ సభ్యులు డీజేఎఫ్ ఆధ్వర్యంలో మంథని తహసిల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కల్లేపల్లి కుమార్ రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మణ్ మాట్లాడుతూ ఆక్రిడిటేషన్ తో సంబంధం లేకుండా యూనియన్ల మీడియాలు అనే వివక్షత లేకుండా వ్యవహరించాలని కోరారు. చిన్న పెద్ద అనే తారతమ్యం చూపకుండా అందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలని అన్నారు. చిన్న, మధ్య, పెద్ద పత్రికలు, డిజిటల్ మీడియా, పిడిఎఫ్ పత్రికలు, యూట్యూబ్ వెబ్ న్యూస్ ఛానల్ లో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అందరికీ ప్రభుత్వ ఫలాలు దక్కాలని అన్నారు. డెస్క్ లో పనిచేస్తున్న రిపోర్టర్లు, సబ్ ఎడిటర్లు, వీడియో ఎడిటర్లు, ఫోటో జర్నలిస్టులు, ప్రధాన సంపాదకులు అన్ని విభాగాల జర్నలిస్టులు అందరినీ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు మండల ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు లేదా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను మంజూరు చేయాలనే డిమాండ్ తో కూడిన వినతిపత్రం మంథని తాసిల్దార్, రాజయ్యకు వినతి పత్రం అందించడం జరిగిందని అన్నారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా కమిటీ సభ్యులు డి. జె .ఎఫ్. సభ్యులందరూ తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలి

- ధాన్యం కొనుగోలు జిల్లా యంత్రాంగం మీకు అండగా ఉంది
- వాతావరణ అసమతుల్యతను దృష్టిలో ఉంచుకొని టార్ప లిన్స్ అందుబాటులో ఉంచుకోవాలి
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** కొల్చారం మండలం రంగంపేట ఫ్రాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వానాకాలం సీజన్ (2024-25) ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో భాగంగా కుల్చారం మండలం రంగంపేట ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఫ్యాక్స్, ఐకెపి, మార్కెటింగ్, శాఖల ద్వారా 497 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు ఇప్పటివరకు వరకు(255) కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, మిగిలిన సెంటర్స్ పూర్తిస్థాయిలో రాబోవు రోజుల్లో రైతులకు అందుబాటులోకి వస్తాయని వివరించారు రైతులు కాయకష్టం చేసి అహర్నిశలు కష్టపడి వరి పంటను పండిస్తారని, రైతుకు భరోసా కల్పిస్తూ మద్దతు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా దాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని, అన్నారు ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకానికి వేర్వేరుగా రికార్డులను సరైన విధంగా నిర్వహించాలని, మూమెంట్ ప్లాన్ రిజిస్టర్ లను సన్న, దొడ్డు రకానికి వేరుగా నిర్వహించాలన్నారు ఈ రిజిస్టర్ లలో రైతు పేరు, ఫోన్ నంబర్, సమయం, స్థలం, రైతు సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని, ప్రతి కేంద్రానికి దొడ్డు రకానికి ఒ%చీ%(ఇ %-% కోర్సు) 1, 2, 3, 4...అని, సన్న రకానికి ఒ%చీ(రా -% సన్నాలు) 1, 2, 3, 4.... అని ఇలా కోడ్ ను కేటాయించామన్నారు ఈ కోడ్ ను ప్రతి ధాన్యం బస్తాలపై ఉండాలని, దీనిని ప్రతి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కచ్చితంగా పాటించాలని, దొడ్డు రకానికి పచ్చ దారం, సన్న రకానికి ఎర్ర దారం ఉండాలని, ఏఈఓలు ప్రతి కొనుగోలు కేంద్రాలను సందర్శించాలన్నారురాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా ప్రతిష్టాత్మకంగా సన్న రకం ధాన్యంపై రూ. 500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ బోనస్ 48 గంటల్లో (రెండు రోజుల్లో) రైతుల అకౌంట్ లలోకి జమ అవుతుందన్నారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు.నిర్దేశించిన బరువుకంటే ఎక్కువ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయవద్దని ఆయన స్పష్టం చేశారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని,నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూకేంద్రాలకు తరలించాలని సూచించారు.ప్రభుత్వం సన్న రకం రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2320, దొడ్డు రకం రూ2,300 ధర నిర్ణయించినందని వెల్లడించారు.కొనుగోలు కేంద్రాల్లో వాతావరణ అసమతుల్యతను దృష్టిలో ఉంచుకుని తప్పనిసరిగా టార్పాలిన్లు, అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. మెదక్ జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లర్ నుంచి 28 లక్షల గన్ని బ్యాగ్స్, గోడౌన్స్ నుంచి 3 లక్షల నూతన గన్ని బ్యాగ్స్ అందుబాటులో ఉంచామన్నారు. ఇంకా కొనుగోలు కేంద్రాలకు అవసరమాకు గన్ని బ్యాగ్స్ కొరకు ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని ప్రణాళిక బద్ధంగా అందుబాటులో ఉంచుతామన్నారు.జిల్లాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ వానాకాలం పంట కొనుగోళ్ల ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రంగంపేట్ సీఈఓ నవీన్ కుమార్, ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రాల సిబ్బంది శ్రీను, బీరప,దుర్గ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మంథని పట్టణంలో గీట్ల జనార్దన్ రెడ్డి వర్ధంతి వేడుకలు

- బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఏ గోలపు శంకర్ గౌడ్.



**మంథని ( ప్రశ్న న్యూస్)** మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధు గారి ఆదేశాల మేరకు రాజ గృహాలో కొమరం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంతిని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఉన్న మాజీ ఎమ్మెల్సీ గీట్ల జనార్ధన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంథని పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న మంథని మొట్టమొదటి ఎమ్మెల్యే గుల్కోట శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.మంథని మండలాధ్యక్షుడు ఎగోళపు శంకర్ గౌడ్, సీనియర్నాయకులు , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, మాజీ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు కనవేన శ్రీనివాస్, మాజీ.ఎంపిటిసి ల ఫోరం అధ్యక్షుడు పెగడ శ్రీనివాస్,మిర్యాల ప్రసాద్ రావు, కౌన్సిలర్ కాయిత సమ్మయ్య, పిఎస్ సి వైస్ చైర్మన్ ప్రకాష్ రెడ్డి, మాజీ సర్పంచ్ కోడారి రాములు, డైరెక్టర్ లు ఆకుల రాజబాబు, గొబ్బూరి వంశీ, ఓదేల లక్ష్మణ్, ఆసిఫ్, ఇర్ఫాన్, రోడ్డ మల్లయ్య, లక్ష్మణ్, గువ్వల రాజు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- మంత్రిని కలిసిన జేఏసీ కోర్ కమిటీ సభ్యులు.



**జూబ్లీహిల్స్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కారించాలని తెలంగాణ వైద్యవిధాన పరిషత్ జేఏసీ చైర్మన్ డాక్టర్.వినయ్ కుమార్, కన్వీనర్ పాండు డిమాండ్ చేసారు. మంగళవారం నాడు జేఏసీ కోర్ కమిటీ సభ్యులు తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ సహకారంతో ఆరోగ్య శ్రీ ట్రస్ట్ భవన్లో



రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి. దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రాన్ని అందజేసారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వైద్య విధాన పరిషత్ స్థానంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ను ఏర్పాటు చేసి, ఉద్యోగులకు 010 పద్దు క్రింద వేతనాలు ఇచ్చే ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని, అలాగే నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆస్పత్రులకు హేతుబద్ధంగా సిబ్బంది నియమకాలను చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తు ఈ రోజు జరుగనున్న సమీక్షా సమావేశంలో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కోర్ కమిటీ సభ్యులు మాట్లాడుతు ఎంతో కాలంగా సమస్యల పరిష్కారానికి ఎదురు చూస్తున్న తమకు ఆరోగ్యశాఖా మంత్రి దామోధర రాజనర్సింహ ఇచ్చిన హామీ తమలో నూతనోత్సాహం, విశ్వాసాన్ని పెంపోందించిందని పేర్కొంటు తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఉద్యోగుల తరపున జేఏసీ కోర్ కమిటీ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వైద్యవిధాన పరిషత్ జేఏసి సలహాదారు యూనుస్, కో చైర్మన్లు. మరియమ్మ , తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు. సత్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి, కో-కన్వీనర్లు శైలజ, క్రిస్టఫర్, వీరష్ బాబు, డేవిడ్, నరసింహారెడ్డి, పరబ్ కుమార్, బైరపాక శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, సంధ్య, దుర్గం.శ్రీనివాస్, రఫిక్, అరుణ్ తదితరులు పాల్గోన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- తాసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన డీజేఎఫ్ జిల్లా కమిటీ





**మంథని ( ప్రశ్న న్యూస్)** వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఆక్రిడేషన్ తో సంబంధం లేకుండా ఇండ్ల స్థలాలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయాలని కోరుతూ డీజేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రామగిరి, కమాన్పూర్ మండల తహసిల్దార్ లకు వినతి పత్రం జిల్లా అధ్యక్షులు కల్లపెల్లి కుమార్ ఆధ్వర్యంలో సమర్పించారు. ఈ సందర్భంగా డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి దాసరి రాజేశం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కల్లపెల్లి కుమార్ మాట్లాడుతూ.. ఆక్రిడిటేషన్ తో సంబంధం లేకుండా యూనియన్లు మీడియాలు అనే వివక్షత లేకుండా, చిన్న పెద్ద అనే తారతమ్యం చూపకుండా అందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలని అన్నారు. చిన్న పత్రికలు, పెద్ద పత్రికలు, డిజిటల్ మీడియా, పిడిఎఫ్ పత్రికలు, యూట్యూబ్ వెబ్ న్యూస్ ఛానల్ లో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అందరికీ ప్రభుత్వ ఫలాలు దక్కాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి సభ్యతం లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు కల్లెపెల్లి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు మాతంగి శివరాజ్, మహిళా జిల్లా అధ్యక్షురాలు పోలు దాసరి రజిత, సమన్వయ కమిటీ చైర్మన్ తాండ్ర శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పోతుల జాన్, జిల్లా ప్రచార కార్యదర్శి కన్నం అవినాష్, రామగుండం మండలం అధ్యక్షుడు మామిడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లాలో టీబీ ప్రివెంటివ్ థెరపి సర్వే



రాజేంద్రనగర్ (ప్రశ్న న్యూస్) చాపకింద నీరులా విస్తరిస్తున్న అత్యంత భయంకర అంటువ్యాధి అయిన క్షయను (టీబీ వ్యాధి) పూర్తిగా నిర్మూలించి క్షయ రహిత భారత్ లక్ష్యంగా ముందడుగు వేస్తున్నామని రాష్ట్ర క్షయ నియంత్రణాధికారి డాక్టర్ రాజేషం అన్నారు. గత సోమవారం నాడు రాష్ట్ర క్షయ నియంత్రణ కార్యాలయంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో టీబీ ప్రివెంటివ్ థెరఫి సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్షయ నిర్మూలనలో భాగంగా విశాఖపట్నం లోని పాపులేషన్ రిసెర్చ్ సెంటర్ (పి.ఆర్.సీ) చెందిన డాక్టర్.రమణ ఆద్వర్యంలో ఆరుగురు సభ్యుల బృందం గత14వ తేదీ నుండి 23వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన టీబీ ప్రివెంటివ్ థెరఫి సర్వే నేపధ్యంలో క్షయ రోగులతో ప్రత్యక్షంగా చర్చించి చికిత్స కాలంలో క్షయ రోగులకు ఎదురవుచున్న సాధక భాదకాలపై వివరాలను సేకరించారు. ముఖ్యంగా రోగులతో మాట్లాడుతు చికిత్సలో భాగంగా మందులు ఎక్కడ వాడుతున్నారని, ఇంటి నుండి ఆస్పత్రి ఎంత దూరంలో ఉంటుందని, మందులు తీసుకోవడాని ఆస్పత్రికి ఎలా వెళ్ళున్నారని, ప్రయాణ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని ఆరా తీసారు. అలాగే క్షయవ్యాధిని అరికట్టే చర్యల్లో భాగంగా రోగుల ఇళ్ళల్లో నివసించే కుటుంబ సభ్యులకు ముందు జాగ్రత్తగా ఇచ్చే ఐసోనైజ్డ్ మాత్రలు వాడుచున్నారా లేదా అనే దానిపై రోగులతో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ టీబీ యూనిట్ లో26 మంది రోగులతో ముచ్చటించగా జిల్లాలో మొత్తం 211 మంది క్షయ రోగులతో పలు అంశాలపై చర్చించి వారి అభిప్రాయాలను సేకరించి జిల్లాలో నిర్వహిస్తున్న క్షయ నిర్మూలన కార్యక్రమాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ పాపారావు, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి. డాక్టర్ స్నేహసుక్లా, వాసుప్రసాద్, డిపిఎస్. శ్రీను, సీనియర్ టీబీ ల్యాబ్ సూపర్ వైజర్. మహ్మద్. రహీం, ఎస్.టి.ఎస్. నరేష్ కుమార్, ఎచ్ వి.మధు బాబు, ఎల్.టి అబ్దుల్ సమీ తదితరులు పాల్గోన్నారు.



# జిహెచ్ఎంసిలో ఏసీపిల కొరత

## అధికారులు లేకుండా పాలన ఎలా సాధ్యం.?

- ఏసీపీలు లేకుండానే ఇన్చార్జి ఏసీపి లతో నెట్టుకొస్తున్న వైనం
- అక్రమ నిర్మాణాలతో జేబులు నింపుకుంటున్న ఇన్చార్జ్ ఏసీపీ లు
- ఏసీపీల నియామకాల్లో పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్న జిహెచ్ఎంసి కమిషనర్
- ఇదే ఛాన్స్ గా భావించి చైన్ మెన్ ల, న్యాక్ ఇంజనీర్ల దోపిడీ దందా




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జిహెచ్ఎంసి పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ, అదుపులేకుండా పోతోంది.ఇన్చార్జ్ ఏసీపీ పాలనలో అధికారులు అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా అమ్యామ్యాలకు తలోగ్గి అక్రమ కట్టడాలు వెనక్కు ఉండే ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.మరోవైపు నిబంధన లకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తుండటం జీహెచ్ఎంసీలో ఇన్చార్జ్ ఏసీపీలు చర్యలు తీసుకోకుండా మౌనం వహించడంపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జిహెచ్ఎంసి పరిధిలో ఇన్చార్జ్ ఏసీపీల అవినీతి, నిర్లక్ష్యం రాజ్యేమేలుతున్నాయి. సికింద్రాబాద్ జోన్ పరిధిలో బేగంపేట, సికింద్రాబాద్ సర్కిల్లో కు ఏసీపీలు లేకపోవడంతో ఇంచార్జ్ ఏసీపి లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక బేగంపేట సర్కిల్ పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది ఇది ఏసీపి లకు చైన్ మెన్ లకు దోచుకునే అడ్డగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ అక్రమ నిర్మాణాలపై చైన్ మెన్ డు ఒక రేటు ఫిక్స్ చేసి ఎసిపికి ఇస్తారు. ప్రస్తుతం ఇంచార్జ్ ఏసిపి ప్రతిరోజు ఒక సూట్ కేస్ తరహాలో అక్రమ సొమ్ము వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకోసమే ఇక్కడ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోరు ఏసీపి లకు కావలసింది అక్రమ సొమ్మే అన్నట్లుగా మారింది వ్యవహారం. డబ్బుంటే చాలు తిమ్మిని బమ్మిని, బమ్మిని తిమ్మిని చేయొచ్చు అనడానికి, డబ్బుకు కొంతమంది ఇన్చార్జి ఏసీపీ దాసోహం అంటే అనడంలో సందేహం లేదు ముఖ్యంగా బేగంపేట సర్కిల్ పరిస్థితి ఇంత దారుణంగా మారింది. ఏసీపీల నియామకాల్లో పూర్తి నిర్లక్ష్యం జిహెచ్ఎంసి కమిషనర్ వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఏసీపీలు లేకుంటేనే ఇన్చార్జి ఏసీపి లతో నెట్టుకొస్తున్నారు అని స్థానికులు ఆరోపిస్తున్నారు.నెలలుగా తరబడి ఏసీపీలు లేకున్నా అక్రమ నిర్మాణాల జోరు సాగుతుందని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలపై ఇంచార్జ్ ఏసీపీలు వ్యవహరిస్తున్న అలసత్వం పరాకాష్టకు చేరుకున్నది కేవలం వీళ్ల లంచాలు తీసుకోవడానికి తప్ప కూల్చివేత్తలు చేయడం లేదని దానికి తగ్గట్టుగా ఇక్కడ జోనల్ కమిషనర్ వ్యవహారం సైతం బాధ్యతారాహిత్యంగా ఉండడంతో ఇక దోచుకున్నోడికి దోచుకున్నంత అన్నట్లుగా మారింది పరిస్థితి. తమను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో ఇంచార్జ్ ఏసీపీలు అధికారులు వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు, జిహెచ్ఎంసి కమిషనర్ స్పందించి పూర్తిస్థాయిలో ఏసీపీలను నియమించాలని అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సవాళ్ల సమయంలోనూ అభివృద్ధి బాట

- నూతన అవకాశాలను అందిపుచ్చుకుంటున్న భారత
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి



**న్యూఢిల్లీ :** ప్రపంచం సవాళ్లను ఎదుర్కొంటున్న వేళ కూడా నూతన వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవడంలో భారత్ మెరుగైన స్థానంలో ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. వస్తు, సేవల విభాగంలో అనేక దేశాలకు భారత్ కీలక భాగస్వామిగా మారాలని భావిస్తోందన్నారు. కొలంబియా యూనివర్సిటీలో నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొన్న మంత్రి ఉపాధి కల్పన, ఆర్థిక వృద్ధి తదితర అంశాలపై మాట్లాడారు. దేశీయంగా సమర్థతను పెంచుకోవడంతో పాటు.. బయటి నుంచి వచ్చే సవాళ్లను తట్టుకొనేలా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు సీతా రామన్ చెప్పారు. భారత్‌లోని పెట్టుబడి అవకాశాలను ఆమె ప్రస్తావించారు. ఉపాధి కల్పనే దేశం ముందున్న అతిపెద్ద సవాలన్నారు. 'చాలా మంది యువత డిగ్రీ పట్టాలతో బయటకు వస్తున్నారు. కానీ, తమకున్న అర్హతకు, సాధించిన ఉద్యోగానికి మధ్య వ్యత్యాసం ఉందని వారు భావిస్తున్నారు. ఈ లోటును భర్తీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. కృత్రిమ మేధ వంటి సాంకేతికతల్లో నైపుణ్యాన్ని అందించేందుకు యువతను సన్నద్ధం చేస్తోంది' అని ఆర్థిక మంత్రి అన్నారు. యూన్ఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ గురించి ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. భారత్ ఎ÷‌–లాస్టిక్ కార్డుల నుంచి క్యూఆర్ కోడ్‌కు వేగంగా మారినట్లు ఆమె తెలిపారు. చిరు దుకాణాలు, కూరగాయల కోసం కూడా దీనిని వినియోగిస్తున్నామన్నారు. ఫలితంగా చెల్లింపులు మరింత పారదర్శకంగా మారాయని, నగదుపై ఆధారపడటం తగ్గిందన్నారు. థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నుంచి సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధనం వైపు వేగంగా మారుతోందన్నారు.

# గ్రూప్ 1 రాజకీయం సద్దుమణిగినట్లే

## - ఎవరికి నష్టం.? ఎవరికి లాభం.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రూప్స్ మెయిన్స్ పరీక్షల విషయంలో జీవో 29ను ప్రభుత్వం విడుదల చేసింది. అప్పట్లో పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. కానీ ఎగ్జామ్ తేదీ దగ్గరకు వచ్చే సరికి జీవో 29 హాట్ టాపిక్ అయిపోయింది. ఎంతగా అంటే ఆ జీవోపై ఎన్నో రకాల ప్రచారాలు జరిగాయి పరీక్షను వాయిదా వేయాలన్న డిమాండ్ తో భారీ ఉద్యమమే జరిగింది. అయితే ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. సుప్రీంకోర్టు వరకూ వెళ్లినా పరీక్ష ఆగలేదు. మెయిన్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 27 వరకూ జరుగుతాయి. అయితే ఫలితాలు మాత్రం కోర్టు తీర్పునకు లోబడి ఉంటాయి. అందుకే ఇప్పుడు గ్రూప్ 1 రాజకీయానికి తెరపడినట్లే. మరి ఇప్పటి వరకూ జరిగిన రాజకీయంలో ఎవరిది పైచేయి.?

### గ్రూప్స్ పరీక్షల వాయిదా ఆందోళనలు ఎవరికి మైనస్

తెలంగాణ ఏర్పడిన తర్వాత గ్రూప్స్ పరీక్షల కోసం ఎంతో మంది ఎదురు చూశారు. కారణం ఏదైనా బీఆర్ఎస్ మొదటి తొమ్మిదేళ్ల కాలంపో గ్రూప్స్ పరీక్షలు పెట్టలేదు. మూడో సారి అధికారంలోకి వచ్చే లక్ష్యంతో పెద్ద ఎత్తున ఉద్యోగాలను భర్తీ చేయాలని కేసీఆర్ నిర్ణయించి వరుసగా నోటిఫికేషన్లు ఇచ్చారు. అలాంటి వాటిలో గ్రూప్ వన్ ఒకటి. కానీ సరైన నిర్వహణ లేకపోవడంతో లీకేజీ సమస్యలు ఏర్పడి గందరగోళం అయింది. ఈ కారణంగా ఉద్యోగాల భర్తీ విషయంలో రావాల్సిన మైలేజీ బీఆర్ఎస్‌కు రాలేదు. పైగా మైనస్ అయింది. ఈ లోపు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా యువత భావించే గ్రూప్ వన్ పోస్టుల భర్తీ పక్రియ బీఆర్ఎస్ హయాంలో ప్రారంభమైనా రద్దులు, వాయిదాలో ఇప్పటి వరకూ వచ్చింది.

### జీవో 29పై రాజకీయ కుట్ర జరిగిందా.?

కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ వన్ ప్రక్రియను పూర్తి చేయాలని అనుకునే సమయంలో జీవో 29 వివాదం తెరపైకి వచ్చింది. తే బీఆర్ఎస్ హయాంలోనే ఒక్క జాబ్‌కి యాభై మంది రేషియోలో మెయిన్స్ పరీక్షకు అభ్యర్థుల్ని నిర్ణయించేలా కటాఫ్ పెట్టాలని జీవో 55 ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన జీవో 55 విషయంలోనూ కొన్ని అభ్యంతరాలు వచ్చాయి. రిజర్వుడు పోస్టులకు 50 రేషియోలో అభ్యర్థులు క్వాలిఫై కాలేదు. అలా తగ్గిన అభ్యర్థుల స్థానంలో మెరిట్ లిస్టు నుంచి మెయిన్స్ రాసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 29 తెచ్చింది. మొత్తం 563 గ్రూప్ 1 పోస్టులకు 28,150 మంది అభ్యర్థులు 55 జీవో ప్రకారం మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించారు. రిజర్వుడు, వికలాంగుల కోటాలో 1/50 నిష్పత్తి కన్న తక్కువ మంది అభ్యర్థులున్న చోట మెరిట్ జాబితా నుంచి అవకాశం కల్పించారు. దీని కోసం జీవో 29 జారీ చేశారు. ఇప్పుడు 31,382 మంది అభ్యర్థులు అయ్యారు. అదనంగా వచ్చిన 3,232 మంది అగ్రవర్ణాల వారనేది రిజర్వుడు కులాల అభ్యర్థుల వాదన. కానీ కాదని ప్రభుత్వం అంటోంది. వికలాంగులు, రిజర్వుడు కులాల ఉద్యోగాలు ఇతర కులాలకు ఇచ్చే అవకాశం ఎలా ఉంటుందన్నప్రశ్నలు వస్తున్నాయి. విషయం ఏదైనా కోర్టుకు చేరింది.

### అత్యధిక మంది రేవంత్‌కే మద్దతు అంటున్న కాంగ్రెస్

చివరికి సీఎం రేవంత్ రెడ్డి పట్టుదలే నెగ్గింది. రేవంత్ రెడ్డిది మొండి పట్టుదల అని కొంత మంది విమర్శిస్తున్నారు. కానీ ఆందోళనలు చేస్తున్నారని ఇరవై వేల మంది ఆశలపై నీళ్లు చల్లడం నాయకుల లక్షణం కాదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. గ్రూప్ వన్ పై జరుగుతున్న ఆందోళనలన్నీ పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని కాంగ్రెస్ గట్టిగా నమ్ముతోంది. గ్రూప్ వన్ అనేది తెలంగాణ నిరుద్యోగులు పదేళ్ల పాటు ఎదురు చూసిన అవకాశం. మెయిన్స్ కోసం వాయిదాలు మీద వాయిదాలు కోరుకునేవారు ఎవరూ ఉండరని అంటున్నారు. అందుకే ఈ విషయంలో రేవంత్ కు యువత మద్దతు లభిస్తుందని బీఆర్ఎస్‌కే మైనస్ అవుతుందని గట్టిగా నమ్ముతున్నారు.

# పార్లమెంట్ తరహాలో అసెంబ్లీ సెంట్రల్ హాల్

- కెటిఆర్ ఇఆర్సి వద్దకు వెళ్లడం జోక్
- ఫోన్ ట్యాపింగ్‌లో బండారం బయటకపడక తప్పదు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** పార్లమెంట్ సెంట్రల్ హాల్ తరహాలో అసెంబ్లీ, కౌన్సిల్ ఒకే దగ్గర ఏర్పాటు చేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. తెలంగాణ అసెంబ్లీని అఘాఖాన్ ట్రస్ట్ రూ. 49 కోట్ల అంచనాతో రెనోవేట్ చేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. 3 నెలల్లో అసెంబ్లీలో చేపట్టిన పనులు పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని అన్నారు. నిజాం తరహాలో అసెంబ్లీని ఎలా కట్టారో అలా మార్పులు చేస్తున్నామని తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పనులను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.... ఇప్పుడు అసెంబ్లీ నుంచి కౌన్సిల్‌కు వెళ్లాలంటే వాహనంలో సీఎం, మంత్రులు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఒకే దగ్గర ఉంటే టైం సేవ్ అవుతుందని చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల అంశంపై ఈఆర్సీ దగ్గరకు వెళ్లటం పెద్ద జోక్ ..... ఆయన ఓ జోకర్ అని విమర్శించారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాలేదని, అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించిన కూడా బీఆర్ఎస్ నేతలకు ఇంకా బుద్ధి రావడం లేదని మండిపడ్డారు. 200 యూనిట్ల ఫ్రీ కరెంటు పేదవారికి తమ ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. భాధ్యత గల ప్రతిపక్షంగా మూసీ పునరుజ్జీవనానికి బీఆర్ఎస్ సహకరించాలని మంత్రి కోరారు. హైదరాబాద్ అభివృద్ధిలో మూసీని భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. నిర్వాసితుల కష్టాలు తమకు తెలుసునని అన్నారు.. నిర్వాసితులకు ఏ కష్టం రానివ్వమని చెప్పారు. పునరావాసం, విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.. కేటీఆర్ గతంలో విదేశీ పర్యటనలు ఎందుకు చేశారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో త్వరలోనే వారి బండారం బయటపడుతుందని అన్నారు. అప్పుడు వారి రాజకీయ జీవితం క్లోజ్ అననారు.

# కేటీఆర్.. మీ వీడియోలు బయటపెట్టమంటావా.?

## - కేటీఆర్‌పై ఎంపీ రఘునందన్ రావు ఆగ్రహం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. మూసీ కూల్చివేతలకు తాను సపోర్ట్ చేస్తున్నట్టుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ కేటీఆర్ మీద తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మూసీ పరివాహక ప్రాంతంలో పర్యటించి స్థానికుల ఇబ్బందులు అడిగి తెలుసుకుంటే దానికి కూడా బీజేపీపై బురదజల్లే ప్రయత్నం కేటీఆర్ చేస్తున్నారని ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. హైడ్రా, మూసీ ప్రాజెక్ట్ వ్యవహారాలు రెండూ ఒకటేనా అనేది.. అమెరికాలో చదువుకుని వచ్చానని చెబుతున్న కేటీఆర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలుసుకోవాలని హితవు పలికారు. మంగళవారం (అక్టోబర్ 22న) రోజు ఉదయం అంబర్ పేట అసెంబ్లీ నియోజకవర్గంలోని గోల్నాక, కృష్ణా నగర్ ప్రాంతాల్లోని మూసీ పరివాహక ప్రాంతంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ మంత్రి కృష్ణాయాదవ్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు తదితరులతో కలిసి ఎంపీ రఘునందన్ రావు పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రఘునందన్ రావు.. కేటీఆర్ మీద తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేటీఆర్ తన మాటలతో ఆందోళనలో ఉన్న ప్రజలను మరింత అయోమయంలో పడేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలు మాట్లాడుతూ ఒకరిపై మరొకరు బురద జల్లుకునేందుకు ఇది సమయం, సందర్భం కాదని చేతనైతే పేదల ప్రజల పక్షాన నిలబడదామంటూ కేటీఆర్‌కు పిలుపునిచ్చారు రఘునందన్ రావు. అంతే తప్ప రఘునందన్ రావు హైడ్రాకు మద్దతుగా మాట్లాడాడంటూ లేనిపోనివి చెప్తూ బురద జల్లేందుకు ప్రయత్నిస్తే మూసీ విషయంలో నువ్వు, నీ అయ్య మాట్లాడిన వీడియోలు బయటపెడితే సిగ్గుతో తల ఎక్కడ పెట్టుకోవాలో అర్థం కాని పరిస్థితి వస్తుందంటూ హెచ్చరించారు. మూసీపై మీరు అప్పుడు మాట్లాడిన వీడియోలు బయటపెట్టమంటావా అంటూ కేటీఆర్‌ను రఘునందన్ రావు ప్రశ్నించారు.

మూసీ గురించి మొదటగా మాట్లాడింది, ఇండ్లకు మార్కింగ్ చేసింది కాలేరు వెంకటేశ్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాతేనని రఘునందన్ రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీ శుద్ధి పేరుతో మార్కింగులు చేసినప్పుడు కాలేరు వెంకటేశ్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లపైకి ఒక్క జేసీబీ వచ్చినా వాటికి అడ్డుగా బీజేపీ కార్యకర్తలు నిలబడతారని ఒక్క ఇళ్లు కూడా తొలగించకుండా చూస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇప్పటికే చాలా స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు.

అధికారంలో ఉన్నప్పుడు ఇండ్లు తొలగిస్తామంటూ మార్కింగులు చేసిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతూ తన పేరు వాడుకుంటున్నారని రఘునందన్ రావు మండిపడ్డారు. ప్రభుత్వం ఏ రకమైన మార్కింగ్ చేసినా పేదల ఇండ్లను తొలగించకుండా ఉండేందుకు బీజేపీ కార్యకర్తలు చివరి శ్వాస వరకు పోరాటం చేస్తారని రఘునందన్ రావు భరోసా ఇచ్చారు.

# బిజెపి ర్యాలీలో దుండగులు చేరారు

- వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు
- ఎంపి ఈటెల రాజేందర్ హెచ్చరిక

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** ఎవరో దుండగులు తమ ర్యాలీలో చొరబడి కుట్ర చేశారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల సికింద్రాబాద్‌లో ప్రశాంత వాతావరణంలో ర్యాలీ నిర్వహించాం. భాజపా కార్యకర్తల ముసుగులో కొందరు చేరి రాళ్లు, చెప్పులు విసిరారు. పారిపోతున్న వారిని పట్టుకుని మరీ పోలీసులు చితకబాదారు. కాషాయ పార్టీ ఎప్పుడూ ప్రజల రక్షణ, శాంతిని మాత్రమే కాంక్షిస్తుంది. ప్రతీకారం అనేది మా పార్టీలో ఉండదు. కాంగ్రెస్ పార్టీ పేరుకే లౌకికవాదం కానీ.. మతోన్మాదులను ప్రోత్సహిస్తోంది.కాంగ్రెస్ హాయాంలో హైదరాబాద్‌లో అనేక సందర్భాల్లో బాంబులు పేలాయి. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు.కేంద్రంలో మోదీ సర్కార్ వచ్చాక ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతోందని ఈటల అన్నారు. రాష్ట్రంలో ఆలయాలపై దాడులు, విగ్రహాల విధ్వంసం జరుగుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశామని ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ దాడుల వెనుక ఎవరున్నారో బయటపెట్టలేదని.. ఎవరు ఎందుకు దాడి చేశారో చెప్పలేదన్నారు. ముత్యాలమ్మ ఆలయంలో దాడి చేసిన వారు పక్కనే హోటల్‌లో ఉన్నావారని స్థానికులు చెబుతు న్నారన్నారు. హిందువులు జరిపిన ర్యాలీలో బయటవారు కావాలని చేసిన పనికి భక్తులను చితకబాదారని మండిపడ్డారు. ప్రజలను కొట్టిన పోలీసులకే ప్రమోషన్ ఇస్తామని ప్రభుత్వం చెబుతోందని.. దీంతో తమపై కూడా హత్యాయత్నం కేసు నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ సమాజంలో శాంతిని కాంక్షిస్తోందని .. ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నం చేయడంలేదని స్పష్టం చేశారు. సీఎంకు తమపై ఎందుకంత ద్వేశభావం కలిగి ఉన్నారని ప్రశ్నించారు. ఆలయాలపై దాడులు చేసిన వారిని పట్టుకోరంటూ మండిపడ్డారు. సీఎంలను మార్చేందుకు మతకలహాలు సృష్టించిన నీచ చరిత్ర కాంగ్రెస్ ది అంటూ విరుచుకుపడ్డారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588